ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 తిరుపతి జిల్లా వార్తలు

ఆదివారం 28 జూలై 2024

వైసీపీలో కలకలం



- బెంగళూరు విమానాశ్రయంలో మోహిత్‌రెడ్డి అరెస్టు
- పనిచేయని చెవిరెడ్డి మంత్రాంగం... పలుకుబడి
- నేడు తిరుపతిలో కోర్టుకు హాజరుపరిచే అవకాశం



బెంగళూరు విమానాశ్రయ ఆవరణలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి

తిరుపతి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): దుబాయ్ విమానమెక్కేందుకు ప్రయత్నిస్తూ తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి శనివారం రాత్రి బెంగళూరు విమానాశ్రయంలో అరెస్టు కావడం చంద్రగిరి నియోజకవర్గ వైసీపీలో కలకలం రేపింది. అతనితో పాటు దుబాయ్ వెళ్ళేందుకు బయల్దేరిన తండ్రి చెవిరెడ్డి భాస్కర రెడ్డి, తమ్ముడు హర్షిత్‌రెడ్డి ఈ ఘటనతో ప్రయాణం విరమించుకున్నారు. మోహిత్‌ను ఇమిగ్రేషన్ అధికారులు అడ్డుకున్న సమయంలో వారితో వాదనకు దిగిన చెవిరెడ్డిని కూడా విమానాశ్రయ అధికారులు నిర్బంధించారు. తండ్రీ కొడుకులు ముగ్గురూ దేశం విడిచి పారిపోయేందుకు ప్రయత్నించారన్న ప్రచారం మొదలైంది. ఈ ఘటనల నేపథ్యంలో చంద్రగిరి వైసీపీ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది.

ఇటీవల జరిగిన ఎన్నికల్లో చంద్రగిరి నుంచీ టీడీపీ అభ్యర్థిగా పులివర్తి నాని, వైసీపీ అభ్యర్థిగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పోటీ పడిన సంగతి తెలిసిందే. పోలింగ్ రోజు రెండు మూడు గ్రామాల్లో జరిగిన ఘర్షణల నేపథ్యంలో పోలింగ్ మరునాడు కౌంటింగు కేంద్రమైన తిరుపతి మహిళా వర్శిటీ ఎదుట టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై హత్యాయత్నం జరిగింది. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి అనుచరులు జరిపిన ఈ భయానక దాడిలో నానీ తృటిలో తప్పించుకున్నారు.ఈ ఘటన చంద్రగిరి నియోజకవర్గంలో తీవ్ర ఉద్రిక్తతలకు కారణమైంది. ప్రతీకార దాడుల్లో పలువురు గాయపడగా, కొన్ని వాహనాలు సైతం ధ్వంసమయ్యాయి. నానీ గన్‌మెన్ జరిపిన కాల్పుల్లో కూడా ఇద్దరు గాయపడ్డారు. పోలింగ్ మరుసటి రోజు ఈవీఎంలు భద్రపరిచిన మహిళా వర్శిటీ ప్రాంగణంలోనే ప్రధాన రాజకీయ పార్టీ అయిన టీడీపీ అభ్యర్థిపై హత్యాయత్నం జరగడాన్ని ఎన్నికల కమిషన్ తీవ్రంగా పరిగణించింది. దీనిపై విచారణకు ప్రత్యేకంగా సిట్ ఏర్పాటు చేసింది. ఈ కేసులో ఇప్పటికే 37మంది అరెస్టు అయి రిమాండులో వున్నారు. వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ప్రోద్బలంతోనే హత్యాయత్నం జరిగిందంటూ కేసులో అతన్ని కూడా నిందితుడిగా చేర్చారు. తనను అరెస్టు చేస్తారనే ఉద్దేశంతో మోహిత్ హైకోర్టులో ముందస్తు బెయిల్‌కు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు మరికొంత గడువు కావాలని ప్రాసిక్యూషన్ కోరడంతో వాయిదా వేస్తూ వచ్చింది. తదుపరి విచారణ ఈనెల 29న సోమవారం జరగాల్సి వుంది. అయితే ఈలోపు మోహిత్‌రెడ్డి బెంగళూరు నుంచీ దుబాయ్ వెళ్ళే ప్రయత్నంలో విమానాశ్రయంలో ఇమిగ్రేషన్ అధికారులకు పట్టుబడ్డారు. వారు అదుపులోకి తీసుకుని తిరుపతి పోలీసులకు సమాచారమిచ్చారు.అరెస్టు చేసేందుకు తిరుపతి పోలీసులు హుటాహుటిన బెంగళూరు బయల్దేరి వెళ్ళారు. ఆదివారం వేకువజామున మోహిత్‌ను తిరుపతి తీసుకొచ్చి అరెస్టు చూపించే అవకాశముంది.దీంతో హైకోర్టులో మోహిత్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ ఇపుడు నిరర్ధకమైనట్టుగా భావించాల్సివుంది. హైకోర్టులో కొత్తగా బెయిల్ పిటిషన్ మళ్ళీ వేయాల్సి వుంటుంది.

తండ్రీ కొడుకులు పారిపోయే ప్రయత్నం చేశారంటూ ప్రచారం

మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి, ఆయన కుమారులు మోహిత్, హర్షిత్ దుబాయ్ వెళ్ళే క్రమంలో మోహిత్ పట్టుబడడంతో ఈ ముగ్గురూ దుబాయ్ పారిపోయే ప్రయత్నం చేశారన్న ప్రచారం మొదలైంది. వాస్తవానికి పులివర్తి నానీ తనపై జరిగిన హత్యాయత్నం కేసులో చెవిరెడ్డి భాస్కర రెడ్డి, ఆయన తనయులు, తమ్ముడు రఘునాథ రెడ్డి తదితరుల పాత్ర వుందని, వారిని నిందితులుగా కేసులో చేర్చాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతానికి మోహిత్‌రెడ్డిని నిందితుడిగా కేసులో చేర్చిన పోలీసులు తర్వాతి దశలో చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఆయన సోదరుడు రఘునాథరెడ్డి,కుమారుడు హర్షిత్‌రెడ్డి పేర్లు కూడా కేసులో చేర్చే అవకాశాలు లేకపోలేదు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నేపథ్యంలో కక్ష సాధింపు చర్యలు,వేధింపులు వుంటాయని,ఈ కేసులో అరెస్టు కూడా చేయచ్చనే అంచనాతో తండ్రీ కొడుకులు ముగ్గురూ దుబాయ్ వెళ్ళిపోయే ప్రయత్నం చేశారనే ప్రచారం జరుగుతోంది.ఇది నిజమైనా కాకపోయినా ఈ తరహా ప్రచారం జరుగుతుండడంతో చంద్రగిరి వైసీపీ శ్రేణులు ఆందోళనలో పడ్డాయి.స్నేహితుడి పెళ్ళి వుంటే మోహిత్ ఒక్కరే బయల్దేరి ఆ క్రమంలో అరెస్టయినా సమాధానం చెప్పుకునే పరిస్థితి వుండేదని, అలా కాకుండా తండ్రీ కొడుకులు ముగ్గురూ దుబాయ్ బయల్దేరడం ఈ ప్రచారానికి ఊతమిస్తోందని సొంత పార్టీ వర్గాలు వాపోతున్నాయి. అన్ని స్థాయుల్లో పలుకుబడి, మంత్రాంగం చేయగలిగిన శక్తిసామర్థ్యాలున్న చెవిరెడ్డి తనయుడి అరెస్టును అడ్డుకోలేకపోవడం కూడా శ్రేణుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీసినట్టవుతోంది. ఉన్నత న్యాయస్థానాల నుంచీ రక్షణ పొందలేకపోవడం కూడా కార్యకర్తల స్థైర్యం సడలేందుకు కారణమవుతోంది. చెవిరెడ్డి, ఆయన కుటుంబం స్థాయిలోనే ఇలా వుంటే తమ పరిస్థితి ఏమిటన్న ఆలోచన వారిలో ఆందోళన రేకెత్తిస్తోంది. కాగా విదేశాల్లో చదివిన తన కొడుకును వీధి పోరాటాలకు సిద్ధం చేస్తున్నారంటూ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి శనివారం రాత్రి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.తన కొడుకు వయసు 25ఏళ్ళని, విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించి ప్రజా జీవితంలోకి వచ్చాడని పేర్కొన్నారు. అలాంటి వాడిని అక్రమ కేసులో అరెస్టు చేయించారని, వీధి పోరాటాలకు సిద్ధం చేస్తున్నారని పేర్కొన్నారు. దీనికి చంద్రబాబుకు కృతజ్ఞతలు చెబుతున్నానన్నారు. ప్రజల పక్షాన ఏ స్థాయి పోరాటానికైనా తాము సిద్ధంగా వున్నామని ప్రకటించారు.

పోలీసుల అదుపులో పార్థీవ గ్యాంగ్?

- గాజులమండ్యం ఘటనతో అప్రమత్తం

తిరుపతి(నేరవిభాగం), జూలై 27: రేణిగుంట మండలం గాజులమండ్యంలో ఓ ఇంట్లో దొంగతనానికి విఫలయత్నం జరిగింది. ఈ ఘటనతో తిరుపతి పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎస్పీ ఆదేశాలతో శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు అన్ని శివారు ప్రాంతాలు, ఏకాంత కాలనీలు, రోడ్లకు ఇరువైపులా గుడిసెలు వేసుకున్న వారిని తనిఖీలు చేశారు. ఎంఆర్‌పల్లె సీఐ అహ్మద్, అలిపిరి ఎస్ఐ రాజశేఖర్, చంద్రగిరి, పాకాల, చిన్నగొట్టిగల్లు పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు చేసి అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. గుడిసెలు, చిన్న, చిన్న రేకుల షెడ్లలో తలదాచుకుని కూలీపనులు పేరుతో ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న వారిని విచారించారు. ముఖ్యంగా నార్త్ ఇండియా గ్యాంగ్‌లు కొన్ని తిరుపతిలో తలదాచుకున్నట్లు పోలీసులకు అనుమానం రావడంతో ఆ దిశగా తనిఖీలు చేసి కొందరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వీరిలో పార్థీవ గ్యాంగ్‌కు చెందిన వారు ఉన్నట్లు అనుమానిస్తున్నారు.

సచివాలయ సిబ్బందితోనే పింఛన్ల పంపిణీ

- 2,67,772 మందికి అందనున్న 113.17కోట్లు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 27: ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను ఆగస్టు ఒకటో తేదీ నుంచి సచివాలయ సిబ్బందే పంపిణీ చేయనున్నారని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఉదయం ఆరు గంటల నుంచే లబ్ధిదారుల ఇళ్ల వద్దకే సిబ్బంది వెళ్లి పింఛను సొమ్ము అందజేస్తారన్నారు. సాంకేతిక కారణాల వల్ల నిలిచిన వారికి మరుసటిరోజు అందజేస్తారని స్పష్టం చేశారు. జిల్లాలో 2,67,772 మంది లబ్ధిదారులకు సుమారు రూ.113.17కోట్లు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. లబ్ధిదారులు కూడా ఇళ్లవద్దే ఉండి పింఛన్లు తీసుకోవాలని కోరారు.

తిరుమల నడకమార్గంలో
చీరాల యువకుడికి పాముకాటు


పాము కాటుకు గురైన నాగేంద్ర

తిరుమల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తిరుమల నడక మార్గంలో శనివారం రాత్రి ఓ యువకుడు పాము కాటుకు గురయ్యాడు. బాపట్ల జిల్లా చీరాలకు చెందిన నాగేంద్ర ఏడుగురు స్నేహితులతో కలిసి శ్రీవారి దర్శనార్థం శనివారం సాయంత్రం తిరుపతికి చేరుకున్నారు. అలిపిరి నుంచి తిరుమలకు నడక ప్రారంభించారు. ఏడవ మైలు వద్ద కాళ్ల నొప్పులతో కాసేపు సేదతీరుదామని కూర్చుకున్న నాగేంద్ర(29)ను పాము కాటేసింది. నొప్పితో ఉలిక్కిపడిన నాగేంద్ర మిత్రులకు విషయం చెప్పాడు. దీంతో దగ్గర్లోని ఫారెస్ట్ సిబ్బంది సహకారంతో హుటాహుటిన తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తరలించారు. విషపూరితమైన పాము కాకపోవడంతో ప్రమాదం తప్పిందని వైద్యులు చెప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు.

వాహనం సహా ఎర్రచందనం దుంగల స్వాధీనం

చంద్రగిరి, జూలై 27: శేషాచలం అటవీ ప్రాంతంలో అటవీ సిబ్బంది రూ.5 లక్షల విలువైన వాహనం సహా ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పరారైన స్మగ్లర్ల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. భాకరాపేట ఎఫ్ఆర్వో దత్తాత్రేయకు అందిన రహస్య సమాచారం మేరకు.. శనివారం నాగపట్ల ఈస్ట్ బీట్‌లో కూంబింగ్ చేస్తుండగా, కొంతమంది స్మగ్లర్లు ఎర్రచందనం దుంగలను వాహనంలోకి లోడ్ చేస్తుండగా అటవీ సిబ్బందికి తారసపడ్డారు. దీంతో అటవీ సిబ్బంది వారిపై దాడులు జరిపి పట్టుకోవడానికి ప్రయత్నించగా, స్మగ్లర్లు ఎర్రచందనం దుంగలను పడేసి, అడవుల్లోకి పరారయ్యారు. దీంతో ఆ ప్రాంతంలో 11 ఎర్రచందనం దుంగలను, వాహనాన్ని స్వాధీనం చేసుకుని, పరారైన స్మగ్లర్ల కోసం అటవీ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు విలువ రూ.5 లక్షల ఉంటుందని అటవీ అధికారులు తెలిపారు. ఈ కూబింగ్‌లో డీఆర్వో వేణు, ఎఫ్‌బీవోలు రవి, రెడ్డప్పరెడ్డి, బేస్ క్యాంప్ ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'పద్మవ్యూహం'

రామచంద్రాపురం, జూలై 27: పరమాల, బుట్టిరెడ్డికండ్రిగ, మోటావారికండ్రిగ మహాభారత ఉత్సవాల్లో భాగంగా శనివారం భాగవతారిణి సుమతి వినిపించిన పద్మవ్యూహం హరికథ సభికులను ఆకట్టుకుంది. ఆలయంలో స్వామి అమ్మవార్లకు తిరుమంజనం నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. సాయంత్రం ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఉత్సవమూర్తుల ఊరేగింపు వైభంగా జరిగింది. అమ్మవారి భారీ కటౌట్, విద్యుత్‌దీపాలంకరణ ఆకట్టుకుంది. ఆలయధర్మకర్త రమేష్ నాయుడు, సురేంద్ర నాయుడు, జయరామిరెడ్డి, దుర్వాసులు, చంద్రారెడ్డి, రోశిరెడ్డి పాల్గొన్నారు.

తహసీల్దారుకు సన్మానం

భాకరాపేట, జూలై 27: చిన్నగొట్టిగల్లు తహసీల్దారు నాగరాజు బదిలీ సందర్భంగా శనివారం రెవెన్యూ కార్యాలయ సిబ్బంది ఆయనను ఘనంగా సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. ఎంపీడీవో సోమశేఖరరెడ్డి, డీటీ అన్వర్ బాషా, ఆర్ఐ శ్రీనివాసులు, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నివారణపై అవగాహన

రామచంద్రాపురం, జూలై 27: రామచంద్రాపురం మండలం కుప్పంబాదూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని అనుపల్లి పంచాయతీలో శనివారం కుష్టువ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న దర్శనం

చంద్రగిరి, జూలై 27: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

వెటర్నరీ ఇన్‌చార్జి వీసీకి అభినందన

తిరుపతి(రూరల్), జూలై 27: ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఇన్‌చార్జి వీసీగా నియమితులైన డాక్టర్ జేవీరమణను ఏపీ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శనివారం మర్యాదపూర్వకంగా కలసి అభినందించారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ యు.నాగేశ్వరరావు నేతృత్వంలో పలువురు విద్యార్థి నాయకులు కలసి దుశ్శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. పశువైద్య విద్యార్థి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఏజరా, జైభారత్ నేషనల్ పార్టీ రాయలసీమ అధ్యక్షుడు భార్గవ్‌కుమార్, పార్థసారథి, ఆదర్శ్‌వినయ్, శ్యామ్, సుధీర్, చిద్విలాష్, ధనుష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణ స్కూల్‌లో వనమహోత్సవం



తిరుపతి(విద్య), జూలై 27: మంగళంలోని నారాయణ పాఠశాలలో శనివారం వనమహోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన ఆర్టీవో ఆదినారాయణతో విద్యార్థులు, టీచర్లు కలసి పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఏజీఎం కిశోర్, ఆర్ఐ వసంతకుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు, టీచర్లు కలసి పాఠశాల నుంచి ఆర్టీవో కార్యాలయం వరకు పర్యావరణ అవగాహనా ర్యాలీని నిర్వహించి, మొక్కల పెంపకంపై ప్రజలను చైతన్యపరిచారు. హెచ్ఎం హంసవేణి, కోఆర్డినేటర్లు షఫీ, ద్రాక్షాయణి, డీన్ వెంకటేష్, వైస్‌ప్రిన్సిపాల్ సుప్రియ, ఏవో మునికుమార్ తదితరులు పాల్గొన్నారు.

61 పరిశ్రమలకు రూ.3.46కోట్ల ప్రోత్సాహకాలు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 27: నూతన ఎంఎస్ఎంఈ పరిశ్రమల స్థాపనకు, యువతకు మెరుగైన ఉపాధి కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం శనివారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ నుంచి సింగిల్ డెస్క్ విధానంలో 1,127 పరిశ్రమలకుగాను 1,080కి అనుమతులు ఇచ్చామని మరో 43 పరిశీలనలో ఉన్నాయని వివరించారు. పరిశ్రమల పరిశీలన కమిటీకి అందిన మేరకు 61 పరిశ్రమలకు రూ.3.46కోట్ల ప్రోత్సాహకం అందించడానికి ఆమోదించినట్లు చెప్పారు. జిల్లాలో ఏపీఐఐసీ తిరుపతి ద్వారా భూమి కేటాయించబడిన పరిశ్రమలు, నాయుడుపేట స్పెషల్ జోన్ ద్వారా భూమి కేటాయించబడిన పరిశ్రమలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రతాప్‌రెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజరు చంద్రశేఖర్, అధికారులు రామకృష్ణారెడ్డి, రమణయ్య, విశ్వనాథరెడ్డి, సుశీలాదేవి, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటినుంచి డిపార్ట్‌మెంటల్ పరీక్షలు

హాజరు కానున్న 3,142మంది అభ్యర్థులు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 27: జిల్లాలో ఆదివారం నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకు ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంటల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్ తెలిపారు. పరీక్షల నిర్వహణపై కలెక్టరేట్‌లో శనివారం అధికారులతో సమీక్షించారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ పరీక్షల కోసం రెండు కేంద్రాలను ఏర్పాటు చేయగా, 3,142మది అభ్యర్థులు హాజరవుతున్నట్లు చెప్పారు. ఎస్వీ జూపార్కురోడ్డులోని అయాన్ డిజిటల్ జోన్, కోటమండలం విద్యానగర్‌లో ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో పరీక్షలు జరుగుతాయన్నారు.

ట్రెక్కింగ్ బాలుకు పురస్కారం



తిరుపతి (కల్చరల్), జూలై 27: తిరుపతిలోని ప్రముఖ ట్రెక్కింగ్ సంస్థ మొజాయిక్ అడ్వెంచర్ కమ్యూన్ (మాక్)కు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు లభించింది. ఈ మేరకు సంస్థ నిర్వాహకుడు బి.బాలసుబ్రహ్మణ్యం (బాలు) సంబంధిత పురస్కారాన్ని అందుకున్నారు. తిరుపతి పరిసరాల్లో 155 వారాలుగా మాక్ బృందం నిరవధికంగా ట్రెక్కింగ్ కార్యక్రమాలను నిర్వహించింది. యువతలో సాహస ప్రవృత్తి పెంపొందించడం, పర్యావరణ స్పృహ, కళలపట్ల చైతన్యం కలిగించడం వంటి సామాజిక కార్యక్రమాలు నిర్వహించినందుకు ఈ పురస్కారం అందించారు. ఈ సందర్భంగా బాలును శనివారం కార్పొరేషన్ రెవెన్యూ అధికారి లోకేశ్వర వర్మ, కాంట్రాక్టర్ ఆర్ఆర్ శ్రీనివాస్, మురళి, లీలామనోహర్, మునిబాబు తదితరులు అభినందించారు.

తహసీల్దార్‌కు సాదర వీడ్కోలు

తిరుపతి అర్బన్, జూలై 27: అర్బన్ తహసీల్దార్ ఎం.వి.ఎస్.నారాయణరెడ్డి సొంతజిల్లా కడపకు బదిలీ నేపథ్యంలో శనివారం రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన్ను సన్మానించి, వీడ్కోలు పలికారు. డీటీ రామచంద్ర, జీవన్‌కుమార్, బాబు, మధు, జానీ బాషా, భూపతి, చెంగల్‌రాయులు, సుమన్, సతీష్, లక్ష్మి పాల్గొన్నారు.

ఆనందగిరిలో ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

● పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పులివర్తి నాని



సుబ్రమణ్య స్వామి పూజలో ఎమ్మెల్యే పులివర్తి నాని, మూషిక వాహనంపై వినాయకుడు

పాకాల, జూలై 27: పాకాల మండలం ఊట్లవారిపల్లె సమీపంలోని ఆనందగిరిపై వెలసిన వళ్లీ దేవసేన సమేత కళ్యాణ సుబ్రమణ్యస్వామి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు శనివారం అక్కగార్ల పూజతో ప్రారంభమయ్యాయి. ఉభయదారులు ఏటుకూరి లలిత కుటుంబీకులు అక్కగార్ల పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉభయదారులు బొల్లినేని అశోక్, వి. సరితా రామచంద్ర నాయుడు కుటుంబసభ్యులు గణపతి పూజ, కంకణధారణ, పుణ్యాహవచనం, అంకురార్పణ, కలశస్థాపన హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి ఉభయదారులు వి.రాంబాబు నాయుడు, కోరా ప్రకాష్ నాయుడు, ఆర్.నారాయణస్వామి, మదురాచ్చారి, శ్రీనివాసపిళ్లై, సంద్ర మురళీధర్ నాయుడు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మూషిక వాహనంపై వినాయకస్వామి ఊరేగింపు నిర్వహించారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆడికృత్తిక ప్రారంభోత్సవ పూజల్లో, వాహనసేవలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు, అధికారులు పూర్ణ కుంభంతో మేళతాళాలు, మంగళవాయిద్యాలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యుల పేరుమీద ఎమ్మెల్యే నాని అర్చన, ప్రత్యేక పూజలు చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆలయ కమిటీ, ఉభయదారులు సమన్వయంతో పని చేసి భక్తులకు సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే కోరారు. 31వ తేది మంగళవారం ఆడికృత్తికను పురస్కరించుకొని విశేష సంఖ్యలో స్వామివారి దర్శనానికి భక్తులు తరలి రానున్న దృష్ట్యా భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. పాకాలనుంచి ఊట్లవారిపల్లె ఆనందగిరి ఆలయం వరకు విద్యుత్ దీపాలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్ ఎస్.చంద్రశేఖర్ నాయుడు, ఈవో యువరాణి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత గంధమనేని రమేష్ కన్నుమూత


గంధమనేని రమేష్ చంద్రప్రసాద్ (ఫైల్ ఫొటో)

నింద్ర/తిరుపతి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు, సీనియర్ నేత గంధమనేని రమేష్ చంద్రప్రసాద్ (77) కన్నుమూశారు. స్వగ్రామమైన పిచ్చాటూరు మండలం ఒరూరుపేటలోని తన నివాసంలో శనివారం రాత్రి 7 గంటల సమయంలో మృతి చెందారు. గత మార్చిలో గుండెపోటుకు గురై కోలుకున్నప్పటికీ వయోభారానికి తోడు అనారోగ్యంతో ఇంటిపట్టునే విశ్రాంతి తీసుకుంటూ శనివారం మరణించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పిచ్చాటూరు మండలం పాత శివగిరి గ్రామానికి చెందిన వీరి కుటుంబం తొలి నుంచీ రాజకీయాల్లో కొనసాగుతోంది. తండ్రి సుబ్బానాయుడు, తమ్ముడు శరత్‌చంద్రప్రసాద్ సర్పంచులుగా పనిచేయగా ఆయన చిన్నాన్న, సీపీఐ నాయకుడు శివయ్య గతంలో పుత్తూరు ఎమ్మెల్యేగా పనిచేశారు. ఇక రమేష్ చంద్రప్రసాద్ టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. స్వగ్రామం నింద్ర మండలంలో ఉన్నప్పటికీ పిచ్చాటూరు రాజకీయాల్లో 1980వ దశకంలో అరుణ అతిథిగృహం కేంద్రంగా రాజకీయ చతురత చాటుకుని చక్రం తిప్పారు. ఎన్టీ రామారావుకు ప్రియ శిష్యుడిగా, చంద్రబాబుకు ఆప్తుడిగా ఉంటూ జిల్లా రాజకీయాల్లో రాణించారు. జిల్లా తెలుగుదేశం పార్టీలో 1990, 2000 దశకాల్లో రమేష్ చంద్ర ప్రసాద్ క్రియాశీలకంగా పనిచేశారు. పార్టీ అధినేత చంద్రబాబుకు అత్యంత సన్నిహితంగా మెలగిన ఆయన పార్టీ అధికారంలో ఉన్న సమయంలోనే రెండు పర్యాయాలు జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. రాజకీయాల్లో వివాద రహితుడిగా పేరు తెచ్చుకున్నారు. జిల్లావ్యాప్తంగా విస్తృత పరిచయాలున్న ఆయన నేతలకు, కార్యకర్తలకు అందుబాటులో వుంటూ అందరికీ తలలో నాలుకలా వ్యవహరించారు. రాష్ట్ర సహకార సంఘాల యూనియన్ చైర్మన్‌గా, రేణిగుంట మండలంలోని గాజులమండ్యంలో ఉన్న ఎస్వీ షుగర్ ఫ్యాక్టరీ చైర్మన్‌గా పనిచేశారు. ఆయన తమ్ముడు హరీష్ చంద్ర ప్రసాద్ డీసీసీబీ చైర్మన్‌గా పనిచేశారు. కాగా రమేష్ చంద్రప్రసాద్ అంత్యక్రియలు ప్రస్తుతం వీరి కుటుంబం స్థిరపడిన ఒరూరుపేటలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు జరుగుతాయని కుటుంబీకులు తెలిపారు. ప్రజలతో నిత్య సంబంధాలు కలిగివుండే రమేష్ చంద్రప్రసాద్ మృతి బాధాకరమని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. ఆయన మృతి టీడీపీకి తీరని లోటని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అభిప్రాయపడ్డారు. ఆయన మృతి పట్ల నింద్ర మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, శ్రీశైలం ఆలయ ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ చక్రపాణి రెడ్డి, ప్రముఖ రచయిత కోట పురుషోత్తం తదితరులు సంతాపం ప్రకటించారు.

మ్యాంగోనగర్‌లో అగ్నిప్రమాదం

● 11 మామిడి మండీల దగ్ధం ● భారీగా ఆస్తి నష్టం ● బాధితులకు ఎమ్మెల్యే నాని పరామర్శ



దామలచెరువు మ్యాంగోనగర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో దగ్ధమవుతున్న మామిడి మండీలు (ఇన్‌సెట్‌లో) ఆహుతైన మండీలు - అగ్నిప్రమాద బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

పాకాల, జూలై 27: మండలంలోని మ్యాంగోనగర్‌లో శనివారం మధ్యాహ్నం సంభవించిన అగ్ని ప్రమాదంలో 11 మామిడి మండీలు దగ్ధమయ్యాయి. ఓ నివాస గృహం కాలిపోయింది. మధ్యాహ్నం ఓ మండీలో వ్యాపించిన మంటలు గాలి ఎక్కువగా రావడంతో వెంటవెంటనే సమీప మండీలకు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో అహ్మద్ బాషా, హకీం, గిరిధర్‌రెడ్డి, భాస్కరయ్య, మల్లికార్జున, జీఎస్.మస్తాన్, హజ్మల్ బాషా, ఫజరుల్లా, యాసానుల్లా, ఫరీద్ బాషా, అంజాద్ బాషాలకు సంబంధించిన మండీలు కాలిపోయాయి. మండీలలో ఉంచిన వస్తువులు. మోటరు సైకిళ్లు, పీవీసీ పైపులు, ఇతర సామగ్రి అగ్నికి ఆహుతి అయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.25 నుండి 30 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని భావిస్తున్నారు. అగ్నిప్రమాద సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ డీఈఆర్ఎఫ్ రమణయ్య ఆధ్వర్యంలో చిత్తూరు, పీలేరు, తిరుపతి, పాకాల నుంచి అగ్నిమాపక వాహనాలు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. లేకుంటే మరింత భారీ నష్టం వాటిల్లేది. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే పులివర్తి నాని మ్యాంగోనగర్‌కు వెళ్లి అగ్నిప్రమాద బాధితులను పరామర్శించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలను విచారించాలని పోలీసులను ఆదేశించారు. అగ్నిప్రమాదంలో నష్టపోయిన బాధితులను ఆదుకోవాలని కలెక్టర్‌ను ఎమ్మెల్యే కోరారు.

మొక్కు తీర్చుకునేందుకు వెళుతూ తండ్రీకూతుళ్ల దుర్మరణం



ట్రాలీని ఢీకొని దెబ్బతిన్న బస్సు - మృతురాలు ఝాన్సీరాణి(ఫైల్ ఫొటో)

చిల్లకూరు, జూలై 27:నెల్లూరుజిల్లా గొలగమూడిలోని వెంకయ్యస్వామి మొక్కు తీర్చుకునేందుకు వెళుతుండగా జరిగిన ప్రమాదంలో తండ్రీకూతుళ్లు దుర్మరణం పాలయ్యారు. పోలీసుల కథనం మేరకు... తమిళనాడు రాష్ట్రం ఊత్తుకోట మండలం ఎస్ఆర్ కండ్రిగకు చెందిన ఝాన్సీరాణి(24)కి ఇటీవల చెన్నైలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. ఈ నేపథ్యంలో కుటుంబసభ్యులతో కలిసి నెల్లూరుజిల్లా గొలగమూడిలోని వెంకయ్యస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకునేందుకు బస్సులో బయల్దేరారు. సూళ్లూరుపేట డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు 33మంది ప్రయాణికులతో వెళుతూ చిల్లకూరు సమీపం వరగలి క్రాస్ రోడ్డు వద్ద ఎస్కవేటర్ల లోడుతో వున్న ఓ ట్రాలీ రోడ్డు పక్కన నిలిపి వుండగా ఢీకొంది.ఆర్టీసీ బస్సు అదుపుతప్పి వెనుక నుంచి ట్రాలీని ఢీకొనడంతో బస్సులో వున్న ఝాన్సీరాణి(24) మృతి చెందింది. ఆమె తండ్రి కుమార్(55)తో పలువురికి తీవ్రగాయాలయ్యాయి. గాయపడినవారిని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.తరువాత మెరుగైన చికిత్స నిమిత్తం కుమార్‌తో పాటు మరో ముగ్గురిని నెల్లూరుకు తరలించారు.వీరిలో కుమార్ చికిత్స పొందుతూ మృతి చెందాడు.తండ్రీకూతుళ్ల మృతిచెందడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

జ్యోతిష శాస్త్రంలో కొత్తపరిశోధనలు రూపొందించాలి

తిరుపతి(రూరల్), జూలై 27: సంస్కృతభాషలో జ్యోతిష శాస్త్రం గొప్ప వైజ్ఞానిక గ్రంథమని, దీనిలోని వైజ్ఞానిక అంశాలకు సాంకేతికతని జోడించి కొత్త పరిశోధనలు రూపొందించాలని జాతీయ సంస్కృతవర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. శనివారం వర్సిటీలోని గండిక్షేత్రంలో నిర్వహించిన అఖిల భారతీయ జ్యోతిష శాస్త్ర విద్వాంసుల సదస్సులో ఆయన మాట్లాడుతూ.. జ్యోతిషంలో ఉన్న విజ్ఞానాన్ని అధ్యయనం చేసి, తద్వారా జ్యోతిష వైజ్ఞానిక తత్వాన్ని అందరూ నేర్చుకోవాలని తెలిపారు. సదస్సులో వీసీని సర్వశాస్త్రహయవాదన అనే బిరుదుతో సత్కరించారు.

ఎన్ఎస్‌యూలో కార్గిల్‌వీరులకు నివాళి

జాతీయ సంస్కృతవర్సిటీలో శనివారం కార్గిల్‌దివస్‌ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అధ్యాపకులతో విద్యార్థులు కలసి కార్గిల్ అమరవీరులకు నివాళి అర్పించారు. ముఖ్యఅతిథిగా ఆర్ఎస్ఎస్ ఏపీ ప్రచారక్ విజయాదిత్య పాల్గొని ప్రసంగించారు. ఆర్మీలో పనిచేసి పదవీ విరమణ పొందిన కెప్టెన్ ఎస్.గోపాల్, నాభి సుబేదార్ మధులని ఈ సందర్భంగా సన్మానించారు. వీసీతో పాటు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ ఎ.చందూలాల్, డాక్టర్ కనపాలకుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కిడ్నాప్ కేసులో కొత్త కోణాలు

తిరుపతి(నేరవిభాగం), జూలై 27: తిరుపతి నివాసి రెడ్డి భాస్కర్ కిడ్నాప్ కేసులో ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వస్తున్నట్లు సమాచారం.చిన్నగొట్టిగల్లు మండలం, చెరువు ముందరపల్లెకు చెందిన రెడ్డి భాస్కర్‌ను కిడ్నాప్ చేయడానికి వారం రోజుల ముందు నుంచే రెక్కీ నిర్వహించినట్లు తెలిసింది. తిరుపతిలో కొబ్బరికాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న రెడ్డి భాస్కర్ తన కుమారుడు కిరణ్ సంపాదనతో ఇటీవల లక్షలాది రూపాయలు పెట్టి ఇల్లు, పొలం, నగలు కొనుగోలు చేస్తుండడం చెరువు ముందరపల్లెకు చెందిన మహ్మద్ జెర్సీన్, ఇర్ఫాన్ గమనించారు. డబ్బులు కాజేయాలనే నెపంతోనే రెడ్డి భాస్కర్‌ను కిడ్నాప్ చేశార పోలీసులు భావిస్తున్నారు. ఇందులో జెర్సీన్ ఎర్రచందనం కేసుల్లో ముద్దాయి కాగా మరో నిందితుడు ఇర్ఫాన్ గతంలో జెర్సీన్ చిన్నాన్నను కొట్టి గాయపరచాడని పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.కొంతకాలంగా బెంగళూరుకు చెందిన అక్రమ్, కాసిక్‌తో జెర్సీన్‌కు సంబంధాలు ఏర్పడినట్లు సమాచారం.కాసిక్‌పై బెంగళూరులోని పలు ప్రాంతాల్లో దొంగతనాలు, దోపిడీ కేసులు నమోదై వున్నట్లు చెబుతున్నారు.రెడ్డి భాస్కర్ కుటుంబం నుంచి సులభంగా డబ్బు సంపాదించవచ్చనే కిడ్నాప్ చేసిన నిందితులకు పోలీసులు అతివేగంతో స్పందించడం అరెస్టుకు దారితీసింది.

పాస్‌పోర్టు దరఖాస్తుదారులకు మెరుగైన సేవలు

● తిరుపతి సేవా కేంద్రం పనితీరు భేష్ ● విజయవాడ ప్రాంతీయ కార్యాలయానికి ఉత్తమ అవార్డుతో బాధ్యత పెరిగింది: ఆర్పీవో


శివహర్ష

తిరుపతి(నేరవిభాగం), జూలై 27: పాస్‌పోర్టు దరఖాస్తుదారులకు మరింత మెరుగైన సేవలు అందిస్తున్నామని విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి (ఆర్పీవో) శివహర్ష తెలిపారు. రెండ్రోజుల పర్యటన నిమిత్తం తిరుపతికి వచ్చిన ఆయన శనివారం నగరంలోని పాస్‌పోర్టు సేవా కేంద్రంలో మీడియాతో మాట్లాడారు. తిరుపతి సేవా కేంద్రం పనితీరు భేషుగ్గా ఉందన్నారు. '2023-24 సంవత్సరానికిగాను ఉత్తమ సేవలు అందించినందుకు విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయానికి అవార్డు ప్రదానం చేశారు. దీనివల్ల మాపై బాధ్యత మరింత పెరిగింది. ఇక మెరుగైన సేవలు అందించడంలో దేశంలోనే విజయవాడ కేంద్రం ప్రస్తుతం 12వ స్థానంలో ఉంది. ఈ కేంద్రం ద్వారా తిరుపతితోపాటు రాయలసీమ జిల్లాలకు మెరుగైన సేవలు అందిస్తుండటం సంతోషంగా ఉంది. విజయవాడ కేంద్రంగా పాస్‌పోర్టుల ప్రింటింగ్ జరుగుతోంది. దీనివల్ల సమయాభావం తగ్గనుంది. స్ట్రీమ్ లైన్డ్ ప్రాసెసింగ్ కోసం కేంద్రీకృత పరిపాలనా దిశగా చర్యలు తీసుకుంటున్నాం. విజయవాడ నుంచి ప్రస్తుతం సంవత్సరానికి 3.70 లక్షల పాస్‌పోర్టులు జారీ చేస్తున్నాం. తత్కాల్ కింద దరఖాస్తు చేసిన వారికి రెండ్రోజులు, సాధారణం అయితే 15 రోజుల్లో పాస్‌పోర్టులు అందిస్తున్న ఘనత మాకే దక్కుతుంది. ఇక తిరుపతి పాస్‌పోర్టు సేవా కేంద్రాన్ని ఆధునికీకరిస్తున్నాం. బయట ఎండకు, వానకు ఇబ్బంది పడుతూ రోడ్లపై నిలబడుకుంటున్న వారికోసం ప్రత్యేకంగా వెయిటింగ్ రూమ్ నిర్మిస్తున్నాం' అని ఆర్పీవో వివరించారు. ఈ సమావేశంలో తిరుపతి పాస్‌పోర్టు సేవా కేంద్రం సిబ్బంది లలిత్‌సింగ్ పాల్గొన్నారు.

ఎంబీయూలో బెలూన్ శాటిలైట్ ప్రయోగం


ఎంబీయూలో బెలూన్ శాటిలైట్‌ను నింగిలోకి ఎగురవేస్తున్న ఛాన్సలర్ మోహన్‌బాబు

చంద్రగిరి, జూలై 27: తిరుపతి సమీపంలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో బెలూన్ శాటిలైట్ ప్రయోగం విజయవంతమైనట్లు ఛాన్సలర్ మోహన్‌బాబు ప్రకటించారు.జాతీయ వాతావరణ పరిశోధనా ప్రయోగశాల(ఎన్ఏఆర్ఎల్), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఐఐఎస్టీ) సహకారంతో ఎంబీయూ విద్యార్థులు తయారు చేసిన ఈ బెలూన్ శాటిలైట్‌ను శనివారం ఉదయం ఎంబీయూలోని పాఠశాల క్రీడామైదానంలో సినీనటుడు, ఎంబీయూ ఛాన్సలర్ మోహన్ బాబు చేతులమీదుగా నింగిలోకి వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు కిలోల బరువుగల శాటిలైట్ 35 కిలో మీటర్ల ఎత్తులో 200 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుందన్నారు.కార్బన్ డయాక్సైడ్ స్థాయి, ఓజోన్ సాంద్రతలు, ఉష్ణోగ్రత, తేమ, వాతావరణ పీడనం వంటి క్లిష్టమైన పర్యావరణ పరిమితులను ఈ శాటిలైట్ పర్యవేక్షిస్తుందన్నారు.ఈ కార్యక్రమానికి హాజరైన ఇస్రో శాస్త్రవేత్తలైన, చంద్రయాన్ మిషన్ 3 డైరెక్టర్ డాక్టర్ వీరముత్తువేల్, అసోసియేట్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ కల్పన, ఓషన్ శాట్ 3 మిషన్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ తెన్మొయి శెల్వీ, షార్ ఇస్రో గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ గోపికృష్ణ మాట్లాడుతూ ఎంబీయూ విద్యార్థులకు తమవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. అనంతరం శాస్త్రవేత్తలను మోహన్ బాబు, ప్రో ఛాన్సలర్ మంచు విష్ణు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఏఆర్ఎల్ శాస్త్రవేత్త డాక్టర్ వెంకటరత్నం, ఎంబీయూ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి, వైస్ ఛాన్సలర్ నాగరాజరామారావు, చీఫ్ గ్రోత్ అండ్ స్ట్రాటజిక్ ఆఫీసర్ వికాస్ సింగ్, ఆర్ అండ్ డీ డీన్ ఈశ్వర్ తదితరులు పాల్గొనున్నారు.

అవినీతి తిమింగలాలపై ఏసీబీ గురి

● ఇప్పటికే వివరాల సేకరణ ● ఏడుగురిపై ప్రత్యేక నిఘా

తిరుపతి(నేరవిభాగం), జూలై 27: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని కట్టడి చేయడానికి చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా జిల్లాలో ఏయే శాఖల్లో ఏళ్ల తరబడి తిష్టవేసి.. అవినీతికి కేంద్ర బిందువుగా మారిన వారు ఎందరున్నారు? ప్రతి పనికీ రేటు పెట్టి వసూలు చేస్తున్న ఘనులెందరు? అనే వివరాలను ఇప్పటికే అవినీతి నిరోధక శాఖ అధికారులు సేకరించారు. ప్రధానంగా ఏడుగురిపై ప్రత్యేక నిఘా పెట్టారు. వీరిలో తిరుపతి కార్పొరేషన్ కార్యాలయంలో ఇద్దరు, ఆర్డీవో కార్యాలయంలో ఒకరు, తహసీల్దార్ కార్యాలయంలో ఇద్దరు, ఎక్సైజ్, సెబ్ కార్యాలయాల్లో ఇద్దరు ఉన్నారు. అలాగే దాదాపు 10 ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న కొందరు అధికారులపై రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. ఇప్పటికే ఫిర్యాదుదారులతో రహస్యంగా సమావేశమై అవసరమైన వివరాలు ఏసీబీ తీసుకున్నట్లు తెలిసింది. అదనపు డీజీ ఆదేశాలతో త్వరలోనే రంగంలో దిగనున్నట్లు సమాచారం.

ఫర్నిచరు గోడౌన్‌లో భారీ అగ్నిప్రమాదం

● రూ.కోటిన్నర వరకు ఆస్తినష్టం

తిరుపతి(నేరవిభాగం), జూలై 27: మంగళం రహదారిలోని ఆర్టీవో కార్యాలయం వద్ద శనివారం అర్ధరాత్రి ఓ ఫర్నిచరు గోడౌన్‌లో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మంగళం రోడ్డులోని డ్యూరో ఫ్లెక్స్ ఫర్నిచర్ షోరూమ్ కమ్ గోడౌన్ ఉంది. ఇక్కడ అన్నిరకాల ఫర్నిచర్లు, బెడ్లు, మంచాలు, తలదిండ్లు, తదితరాలు ఉంటాయి. వీటిని ఇక్కడి నుంచి తిరుపతిలోని తమ బ్రాంచ్‌లకు సరఫరా చేస్తారు. శనివారం రాత్రి యజమాని గోడౌన్ మూసేసి ఇంటికెళ్లారు. అర్ధరాత్రి సమయంలో విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగింది. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గోడౌన్‌లో దూది, కాయర్‌లు, మంచాలు, కుర్చీలు ఉండటంతో మంటలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. తిరుపతి నుంచి వచ్చిన అగ్నిమాపక వాహనంతో మంటలను అదుపు చేయలేక పోయారు. పుత్తూరు, శ్రీకాళహస్తి, పాకాల ప్రాంతాల నుంచి కూడా అగ్నిమాపక వాహనాలను రప్పించారు. అతికష్టంపై అర్ధరాత్రి 12.30- ఒంటిగంట ప్రాంతంలో మంటలు అదుపు చేయగలిగినట్లు తిరుపతి అగ్నిమాపక శాఖ అధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ ఘటనలో దాదాపు రూ.కోటిన్నర వరకు ఆస్తి నష్టం జరిగిందని సమాచారం. అలిపిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



దగ్ధమైన ఫర్నిచరు, ఎగసి పడుతున్న మంటలు

నా కుమార్తె నుంచి మా కుటుంబాన్ని కాపాడండి

ఓ తండ్రి వేడుకోలు

తిరుపతి అర్బన్, జూలై 27: 'నా కుమార్తె నుంచి మా కుటుంబాన్ని కాపాడండి' అని తిరుచానూరుకు చెందిన మునస్వామి నాయుడు విజ్ఞప్తి చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. తన ఇద్దరు కుమార్తెలకు సంప్రదాయంగా పెళ్లిళ్లు చేసి పంపామన్నారు. చిన్న కుమార్తె లత మరిన్ని ఆస్తులు ఇవ్వాలంటూ వేధిస్తోందన్నారు. తన కుమారుడు శివశేఖర్‌నాయుడు రెక్కల కష్టంతో కూడబెట్టుకున్న నగదు, ఆస్తులను తల్లి ద్వారా లాక్కుంద న్నారు. తనకున్న రాజకీయ పలుకుబడితో దౌర్జన్యం చేస్తుండటంతో కోర్టును ఆశ్రయించామన్నారు. పోలీసులు కూడా ఆమెకే సహకరిస్తున్నారని వాపోయారు. కుటుంబ వ్యవహారంలో ప్రభుత్వం, పోలీసులు జోక్యం వద్దని.. కోర్టు తుది తీర్పు వరకు వేచి ఉండాలని కోరారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి కూడా తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

31న నికాన్ వర్క్‌షాప్


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఫొటోగ్రాఫర్లు

తిరుపతి అర్బన్, జూలై 27: లక్ష్మీపురం సర్కిల్ వద్ద ఉన్న చక్రి హోటల్లో ఈనెల 31న నికాన్ వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు తిరుపతి, తిరుమల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌రాజు తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. అదే రోజున కొత్త ఫొటోగ్రాఫర్లకు సభ్యత్వం నమోదు చేయిస్తామన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నికాన్ కంపెనీ ప్రత్యేక నిపుణులతో శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రవేశం ఉచితమని.. నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతినిధులు రాధాకృష్ణ, సతీష్, పురంధర్, రహ్మతుల్లా, సురేష్, కృష్ణ, రమణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం


సుబ్రహ్మణ్యం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 27: ఎస్వీయూ పర్ఫార్మింగ్ ఆర్ట్స్ పరిశోధకుడు కె.సుబ్రహ్మణ్యం డాక్టరేట్ పొందారు. ఏ స్టడీ ఆఫ్ - జాతి భేద సప్తదాళ సహిత శతరాగ రత్నమాలిక ఆఫ్ శ్రీమాన్ తిరుమల నల్లాన్ చక్రవర్తి వేంకట నారాయణాచార్యులు అంశంపై రిటైర్డు అధ్యాపకురాలు డాక్టర్ ఎస్.పద్మ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. ఈ మేరకు సీతా దామ్లానాయక్ తెలిపారు.

అలరించిన ప్రియా సిస్టర్స్ కచేరి



తిరుపతి (కల్చరల్), జూలై 27: త్యాగరాజ స్వామి ట్రస్టు 80వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం జరిగిన సంగీత సభలు సంగీతప్రియులను అలరించాయి. రాత్రి 7.30 గంటలకు ప్రముఖ గాయనీమణులు ప్రియాసిస్టర్స్ గాత్ర కచేరి సమ్మోహనపరిచింది. అంతకుముందు సాయంత్రం నాలుగు నుంచి 5.30 గంటల వరకు శ్రీవేంకటేశ్వర సంగీత నృత్య కళాశాల విద్యార్థుల కచేరి జరిగింది. 5.45 నుంచి రాత్రి 7.45 గంటల వరకు తిరుమలై బ్రదర్స్ (రంగాచారి, ఎంబార్ కస్తూరి) గాత్ర కచేరి నిర్వహించారు. ఆదివారం సాయంత్రం సప్తగిరి విద్వన్మణి బిరుదు ప్రదానం, అనంతరం ప్రముఖ కళాకారిణి ఎ.కన్యాకుమారి వయోలిన్ కచేరి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

తిరునగరిని వై క్లాస్ గ్రేడ్‌కు సిఫార్సు చేయండి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న భానుప్రకాష్‌రెడ్డి తదితరులు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 27: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు కూడా ప్రయోజనం పొందేలా తిరుపతి నగరాన్ని వై క్లాస్‌కు అప్‌గ్రేడ్ చేయడానికి సిఫార్సు చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి కోరారు. శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తిరుపతిలో ఏడు విశ్వవిద్యాలయాలు, ఐఐటీ, ఐసర్ సంస్థలతో విద్యా కేంద్రంగా విరాజిల్లుతుందన్నారు. ఇక్కడ నివసిస్తున్న జనాభా 10లక్షలకు చేరువగా ఉందని.. కేంద్రప్రభుత్వ ఉద్యోగులకు 20శాతం హెచ్ఆర్ఏ కావాలంటే నగర జనాభా గణన ధ్రువీకరించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సామంచి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్‌లో కార్మికుల స్థలాలను 22ఏ నుంచి తొలగించండి


కలెక్టర్‌ను సన్మానిస్తున్న దేవేంద్రరెడ్డి

తిరుపతి (జీవకోన), జూలై 27: ఆటోనగర్‌లోని కార్మికుల స్థలాలను 22ఏ జాబితా నుంచి తొలగించాలని ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ స్మాల్ అండ్ మీడియం అసోసియేషన్ అధ్యక్షుడు దేవేంద్రరెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆటోనగర్‌లోని సర్వే నెంబరు 74/7లో అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చేతుల మీదుగా ఎస్వీ ఆటోనగర్‌లో ఆటో వర్కర్స్ సేల్డీడ్ ద్వారా ప్లాట్లు కేటాయింపు చేశారని వివరించారు. నిషేధిత జాబితాలో ఉండటం వల్ల రుణసదుపాయం పొందలేకపోతున్నారని వాపోయారు. దీనిపై ఆర్డీవోతో చర్చించి తగిన న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

ఎస్వీయూలోకి బయటి వ్యక్తుల రాకను అరికట్టండి

విద్యార్థి సంఘాల డిమాండ్


వీసీ అప్పారావుకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 27: ఎస్వీయూనివర్సిటీలోకి బయటి వ్యక్తుల రాకను అరికట్టాలని పలు విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఇన్‌చార్జి వీసీ అప్పారావుకు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నేత చిన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున, జీఎన్ఎస్ నేత పాల్యా శివశంకర్‌నాయక్, తదితరులు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. వర్సిటీలోకి గంజాయి, డ్రగ్స్ సరఫరా కాకుండా అడ్డుకోవాలని కోరారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సును ఏర్పాటు చేయాలన్నారు. చంద్ర, ప్రసన్న, రంజిత్, భాస్కర్ పాల్గొన్నారు.

అమ్మో.. కమిషనర్ సీసీలా..!

తిరుపతి కార్పొరేషన్లో వారంటే హడల్

తిరుపతి - ఆంధ్రజ్యోతి

తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ సీసీ (క్యాంప్ క్లర్క్)లంటే ఉన్నతోద్యోగులే కాదు కార్పొరేటర్లు కూడా హడలెత్తిపోవాల్సిందే. వీరికి నచ్చినవారికే కమిషనర్ అపాయింట్‌మెంట్ దొరుకుతుంది. వారిని ప్రసన్నం చేసుకుంటేనే కాంట్రాక్టర్ల ఫైల్ టేబుల్ పైకి వెళుతుంది. లేదంటే ఎంతటివారైనా గంటలు తరబడి వేచివుండి తిరిగి వెళ్లిపోవాల్సిందే. వీరిచర్యలతో పలువురు కమిషనర్లు సైతం కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్లతో మాటలు పడాల్సి వచ్చింది. కమిషనర్‌కు ఇద్దరు సీసీలు ఉన్నారు. ఆమె ప్రోగ్రాం షెడ్యూల్ అంతా వీరే చూస్తారు. అయితే వీరు చెప్పిందే అక్కడ చెల్లుబాటు అవుతుంది. విభాగాధిపతులైనా వీరి మాట విని తీరాల్సిందే. ఇటీవల తాజా మాజీ కమిషనర్ అదితిసింగ్‌ను కలిసేందుకు ఓ కార్పొరేటర్ కమిషనర్ చాంబర్ వద్దకు వెళ్లారు. 'మేడం' లోపల మీటింగ్‌లో ఉన్నారు వెయిట్ చేయమని సీసీ.. రెండు గంటలు బయట నిలిపేశారు. తీరా ఎలాంటి మీటింగ్ లేకుండా ఆమె ఖాళీగా ఉండడాన్ని గమనించిన సదరు కార్పొరేటర్ కమిషనర్ చాంబర్ తలుపు తోసుకెళ్లారు. ఇదేం పద్ధతి అంటూ ఆమెను నిలదీశారు. దీంతో ఆ సమయంలో విధుల్లో ఉన్న సీసీని పిలిచి ఆమె గట్టిగా మందలించారు. మీడియాను కూడా కమిషనర్ దగ్గరకు రానివ్వకుండా వీరు చాలా జాగ్రత్త పడతారు. అదితిసింగ్ బాధ్యతలు తీసుకున్న ఆరు నెలల్లో కార్పొరేషన్‌కు సంబంధించి ఒక్కటంటే ఒక్క మీడియా సమావేశం నిర్వహించక పోవడానికి కూడా సదరు సీసీలే కారణమని తెలిసింది. మీడియాతో మాట్లాడకూడదన్న ఆంక్షలు సీసీలే కమిషనర్‌కు ఇచ్చేస్థాయి వచ్చిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వీరి వైఖరి వల్లే పలువురు కమిషనర్లు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. వీరు మహాముదుర్లు అని తెలుసుకున్న ఓ మాజీ కమిషనర్ ఆ బాధ్యతల నుంచి వీరిని దూరం పెట్టారు. ప్రస్తుతం కొత్తగా వచ్చిన నారపురెడ్డి మౌర్య కూడా అదే బాటను ఎంచుకున్నట్టు తెలుస్తోంది. పలు ఆరోపణలున్న సీసీలను మార్చే యోచనలో ఉన్నట్టు సమాచారం.


పృథ్వీరాజ్ రాసో పద్యనాటకం


కళాకారులతో నిర్వాహకులు, అతిథులు

అలరించిన 'పృథ్వీరాజ్ రాసో'


నృత్య ప్రదర్శన

తిరుపతి (కల్చరల్), జూలై 27: తిరుపతికి చెందిన అభినయ ఆర్ట్స్ వారి 24 వ వార్షికోత్సవం సందర్భంగా భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, కొత్త ఢిల్లీ, ఆంధ్ర రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక శాఖ, అమరావతి, టీటీడీ సంయుక్త నిర్వహణలో హనుమ అవార్డ్స్ పోటీలలో భాగంగా ఎనిమిదవ రోజు శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు డాక్టర్ రామన్ ఫౌండేషన్, శ్రీసాయిబాబా నాట్య మండలి, విజయవాడ వారి పృథ్వీరాజ్ రాసో పద్యనాటకం ప్రేక్షకులను అలరించింది. అంతకు ముందు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నృత్యపోటీలు నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి ఇంద్రప్రస్థం సాంఘిక నాటిక, అనంతరం రాత్రి 8 గంటలకు శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరు వారి కౌసల్యా సుప్రజా రామ అనే సాంఘిక నాటికలు వీక్షకులను అలరించాయి.

నేటి కార్యక్రమాలిలా..

ఆదివారం ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వివిధ విభాగాల్లో నృత్య పోటీలు జరుగుతాయి. సాయంత్రం నాలుగు గంటలకు అభినయ ఆర్ట్స్ తిరుపతి వారి శ్రీపద్మావతి శ్రీనివాస కల్యాణం పద్యనాటకం ప్రత్యేక ప్రదర్శన ఉంటుంది. చివరగా రాత్రి ఏడు గంటలకు హనుమ అవార్డుల ప్రదాన సభ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.


ఇంద్రప్రస్థం, కౌసల్యా సుప్రజా రామ సాంఘిక నాటికల్లోని సన్నివేశాలు

ఉన్నత విద్యాలయాల సమస్యలు పరిష్కరించాలి


ఎస్వీ పాలిటెక్నిక్ వద్ద పీడీఎస్‌వో నేతల నిరసన

తిరుపతి(విద్య), జూలై 27: ఉన్నత విద్యాలయాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (పీడీఎస్‌వో) నాయకులు డిమాండ్ చేశారు. ఆ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చిన పిలుపుతో ప్రభుత్వ ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాల వద్ద శనివారం విద్యార్థులతో కలిసి నిరసన ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థిసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.ఆశ మాట్లాడుతూ.. ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ, ఇంజనీరింగ్ కళాశాలు, యూనివర్సిటీలు అనేక సమస్యలతో సతమతమౌతున్నాయన్నారు. పరిశోధనశాలలు, పరికరాలు ఉన్నత విద్యాసంస్థల్లో లేవని, అధ్యాపకులు, ఆచార్యుల కొరత కూడా వేధిస్తోందని వివరించారు. స్కాలర్‌షిప్‌లు, ఫెలోషిప్‌లు రాక విద్యార్థులు కూడా ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా నాయకులు ఉదయ్, సురేష్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్లను వేధిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలి : సీఐటీయూ

తిరుపతి(ఆటోనగర్), జూలై 27: ఆశ వర్కర్లను వేధిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని సీఐటీయూ నాయకుడు కందారపు మురళి డిమాండ్ చేశారు. శనివారం మధ్యాహ్నం డీఎంహెచ్‌వో కార్యాలయంలో శ్రీహరిని కలసి వినతిపత్రం అందజేశారు. బాలాయపల్లి మండలం సుబ్రమణ్యంలో పీహెచ్‌సీ డాక్టర్‌పై దౌర్జన్యానికి పాల్పడిన టీడీపీ నాయకులపై కేసులు నమోదు చేయాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నాయకులు ఆర్.లక్ష్మి, జి.బాల సుబ్రమణ్యం, మునిరాజ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చట్టాల మార్పు శాపమే..!

ఏపీ బార్ కౌన్సిల్ న్యాయవాది సుంకర రాజేంద్ర ప్రసాద్


సదస్సులో ప్రసంగిస్తున్న రాజేంద్ర ప్రసాద్

తిరుపతి(ఆటోనగర్), జూలై 27: దేశంలో చట్టాల మార్పు వరం కాదని, శాపమేనని ఏపీ బార్ కౌన్సిల్ న్యాయవాది సుంకర రాజేంద్ర ప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు. యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన భవన్‌లో శనివారం దేశంలో చట్టాల మార్పు వరమా-శాపమా అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. చట్టాల మార్పు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, ప్రశ్నించే గొంతుకను అణచివేయడానికి ప్రభుత్వం కుట్ర చేస్తుందని చెప్పారు. పేర్లు, సెక్షన్లు మార్చారే తప్ప, ప్రజలకు సత్వర న్యాయం జరగడానికి ఎక్కడా చర్యలు తీసుకోలేదన్నారు. భారత లా కమిషన్ చేసిన ప్రతిపాదనలు,మార్పులను ఏమాత్రం పటించుకోకుండా, పార్లమెంట్‌లో ప్రతిపక్ష సభ్యుల ఆమోదం లేకుండానే ఏకపక్షంగా నియంతృత్వ దోరణితో బీజేపీ ప్రభుత్వం బిల్లులను చట్టాలుగా ఆమోదించిందని వాపోయారు. న్యాయవ్యవస్థకు తూట్లు పొడిచేలా పోలీసు వ్యవస్థకు అధికారాలను కట్టబెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల ప్రజా, కార్మిక, దళిత ఉద్యమాలకు తీవ్ర నిర్బంధం తప్పదన్నారు. ఐపీసీ 123ఏలో రాజద్రోహంగా ఉన్న పేరును దేశద్రోహంగా మార్చి బీఎన్ఎస్152గా మార్పు చేసిందన్నారు. ఈ కారణంగా సామూహిక నిరసనలు, ఆందోళనలు, సభలు పెట్టి ప్రసంగాలు చేస్తే.. దేశద్రోహంగా చిత్రీకరించే ప్రమాదముందన్నారు. చట్టాల మార్పు వల్ల కలిగే అనర్థాలను విశ్రాంత న్యాయమూర్తి గుర్రప్ప, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి వివరించారు. సదస్సులో వివిధ సంఘాల నాయకులు వి.నాగరాజు, జీబీఎస్ మణ్యం, చల్లా వెంకటయ్య, ఎం.నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు ముమ్మరం చేయండి

జనసేన నేతలకు నాదెండ్ల దిశానిర్దేశం


నాదెండ్లతో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు ముమ్మరం చేయాలని నేతలకు పార్టీ ముఖ్యనేత, మంత్రి నాదెండ్ల మనోహర్ దిశా నిర్దేశం చేశారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతోపాటు ఆ పార్టీ నేత, రాష్ట్ర ఉద్యోగుల సంఘ మాజీ నాయకుడు ఎం.నరసింహులు నాయుడు తదితరులు శనివారం అసెంబ్లీ ప్రాంగణంలో మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా సభ్యత్వ నమోదు ప్రక్రియపై నాదెండ్ల ఆరాతీశారు. సభ్యత్వ నమోదులో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న నరసింహలు నాయుడిని అభినందించారు.

166 మందికి కృత్రిమ కాళ్లు అందిస్తాం



బాధితుల కాళ్ల కొలతలు తీసుకుంటున్న సిబ్బంది

తిరుపతి(ఆటోనగర్), జూలై 27: ప్రమాదాల్లో కాళ్లు పోగొట్టుకున్న 166 మందికి మరో రెండు నెలల్లో కృత్రిమ కాళ్లు అందిస్తామని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు ఏవై శ్రీనివాస్ తెలిపారు. ఫ్రీడం ట్రస్ట్, హుండాయ్ ట్రాన్సిస్ లీయర్ ఆటోమోటివ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారి సౌజన్యంతో అర్హులను ఎంపిక చేసినట్లు చెప్పారు. శనివారం రాస్ ప్రధాన కార్యాలయంలో బాధితుల కాళ్ల కొలతలు తీసుకున్నారు. కార్యక్రమంలో సుదర్శన్ రెడ్డి, రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం, రాజశేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు నివాళి


అబ్దుల్ కలాంకు నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 27: భారత మాజీ రాష్ట్రపతి, అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా శనివారం బీజేపీ నాయకులు నివాళి అర్పించారు. బండ్లవీధిలోని బీజేపీ తూర్పు మండల కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంయాదవ్, జనార్దన్‌రెడ్డి, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు దరఖాస్తుదారులకు మెరుగైన సేవలు

- తిరుపతి సేవా కేంద్రం పనితీరు భేష్
- విజయవాడ ప్రాంతీయ కార్యాలయానికి
- ఉత్తమ అవార్డుతో బాధ్యత పెరిగింది: ఆర్పీవో


శివహర్ష

తిరుపతి(నేరవిభాగం), జూలై 27: పాస్‌పోర్టు దరఖాస్తుదారులకు మరింత మెరుగైన సేవలు అందిస్తున్నామని విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి (ఆర్పీవో) శివహర్ష తెలిపారు. రెండ్రోజుల పర్యటన నిమిత్తం తిరుపతికి వచ్చిన ఆయన శనివారం నగరంలోని పాస్‌పోర్టు సేవా కేంద్రంలో మీడియాతో మాట్లాడారు. తిరుపతి సేవా కేంద్రం పనితీరు భేషుగ్గా ఉందన్నారు. 2023-24 సంవత్సరానికిగాను ఉత్తమ సేవలు అందించినందుకు విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయానికి అవార్డు ప్రదానం చేశారు. దీని వల్ల మాపై బాధ్యత మరింత పెరిగింది. ఇక మెరుగైన సేవలు అందించడంలో దేశంలోనే విజయవాడ కేంద్రం ప్రస్తుతం 12వ స్థానంలో ఉంది. ఈ కేంద్రం ద్వారా తిరుపతితోపాటు రాయలసీమ జిల్లాలకు మెరుగైన సేవలు అందిస్తుండటం సంతోషంగా ఉంది. విజయవాడ కేంద్రంగా పాస్‌పోర్టుల ప్రింటింగ్ జరుగుతోంది. దీనివల్ల సమయాభావం తగ్గనుంది. స్ట్రీమ్ లైన్డ్ ప్రాసెసింగ్ కోసం కేంద్రీకృత పరిపాలనా దిశగా చర్యలు తీసుకుంటున్నాం. విజయవాడ నుంచి ప్రస్తుతం సంవత్సరానికి 3.70 లక్షల పాస్‌పోర్టులు జారీ చేస్తున్నాం. తత్కాల్ కింద దరఖాస్తు చేసిన వారికి రెండ్రోజులు, సాధారణం అయితే 15 రోజుల్లో పాస్‌పోర్టులు అందిస్తున్న ఘనత మాకే దక్కుతుంది. ఇక తిరుపతి పాస్‌పోర్టు సేవా కేంద్రాన్ని ఆధునికీకరిస్తున్నాం. బయట ఎండకు, వానకు ఇబ్బంది పడుతూ రోడ్లపై నిలబడుకుంటున్న వారికోసం వెయిటింగ్ రూమ్ నిర్మిస్తున్నాం' అని ఆర్పీవో వివరించారు. తిరుపతి పాస్‌పోర్టు సేవా కేంద్రం సిబ్బంది లలిత్‌సింగ్ పాల్గొన్నారు.

అవినీతి తిమింగలాలపై ఏసీబీ గురి

ఇప్పటికే వివరాల సేకరణ ● ఏడుగురిపై ప్రత్యేక నిఘా

తిరుపతి(నేరవిభాగం), జూలై 27: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని కట్టడి చేయడానికి చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా జిల్లాలో ఏయే శాఖల్లో ఏళ్ల తరబడి తిష్ఠవేసి.. అవినీతికి కేంద్ర బిందువుగా మారిన వారు ఎందరున్నారు? ప్రతి పనికీ రేటు పెట్టి వసూలు చేస్తున్న ఘనులెందరు? అనే వివరాలను ఇప్పటికే అవినీతి నిరోధక శాఖ అధికారులు సేకరించారు. ప్రధానంగా ఏడుగురిపై ప్రత్యేక నిఘా పెట్టారు. వీరిలో తిరుపతి కార్పొరేషన్ కార్యాలయంలో ఇద్దరు, ఆర్డీవో కార్యాలయంలో ఒకరు, తహసీల్దార్ కార్యాలయంలో ఇద్దరు, ఎక్సైజ్, సెబ్ కార్యాలయాల్లో ఇద్దరు ఉన్నారు. అలాగే దాదాపు 10 ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న కొందరు అధికారులపై రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. ఇప్పటికే ఫిర్యాదుదారులతో రహస్యంగా సమావేశమై అవసరమైన వివరాలు ఏసీబీ తీసుకున్నట్లు తెలిసింది. అదనపు డీజీ ఆదేశాలతో త్వరలోనే రంగంలో దిగనున్నట్లు సమాచారం.

ఆనందగిరి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పులివర్తి నాని


సుబ్రమణ్యస్వామి పూజలో ఎమ్మెల్యే పులివర్తి నాని

పాకాల, జూలై 27: పాకాల మండలం ఊట్లవారిపల్లె సమీపంలోని ఆనందగిరిపై వెలసిన వళ్లీ దేవసేన సమేత కళ్యాణ సుబ్రమణ్యస్వామి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు శనివారం అక్కగార్ల పూజతో ప్రారంభమయ్యాయి. ఉభయదారులు ఏటుకూరి లలిత కుటుంబీకులు అక్కగార్ల పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉభయదారులు బొల్లినేని అశోక్, వి. సరితా రామచంద్ర నాయుడు కుటుంబసభ్యులు గణపతి పూజ, కంకణధారణ, పుణ్యాహవచనం, అంకురార్పణ, కలశస్థాపన హోమం నిర్వహించారు. రాత్రి ఉభయదారులు వి.రాంబాబు నాయుడు, కోరా ప్రకాష్ నాయుడు, ఆర్.నారాయణస్వామి, మధురాచ్చారి, శ్రీనివాసపిళ్లై, సంద్ర మురళీధర్ నాయుడు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మూషిక వాహనంపై వినాయకస్వామి ఊరేగింపు నిర్వహించారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆడికృత్తిక ప్రారంభోత్సవ పూజల్లో, వాహనసేవలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు, అధికారులు పూర్ణ కుంభంతో మేళతాళాలు, మంగళవాయిద్యాలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యుల పేరుమీద ఎమ్మెల్యే నాని అర్చన, ప్రత్యేక పూజలు చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆలయ కమిటీ, ఉభయదారులు సమన్వయంతో పనిచేసి భక్తులకు సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే కోరారు. 31వ తేది మంగళవారం ఆడికృత్తికను పురస్కరించుకొని విశేష సంఖ్యలో స్వామివారి దర్శనానికి భక్తులు తరలి రానున్న దృష్ట్యా భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. పాకాలనుంచి ఊట్లవారిపల్లె ఆనందగిరి ఆలయం వరకు విద్యుత్ దీపాలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్ ఎస్.చంద్రశేఖర్ నాయుడు, ఈవో యువరాణి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వాహనం సహా ఎర్రచందనం దుంగల స్వాధీనం

పరారైన స్మగ్లర్ల కోసం గాలింపు



చంద్రగిరి, జూలై 27: శేషాచలం అటవీ ప్రాంతంలో అటవీ సిబ్బంది రూ.5 లక్షల విలువైన వాహనం సహా ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పరారైన స్మగ్లర్ల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. భాకరాపేట ఎఫ్‌ఆర్వో దత్తాత్రేయకు అందిన రహస్య సమాచారం మేరకు.. శనివారం నాగపట్ల ఈస్ట్ బీట్‌లో కూంబింగ్ చేస్తుండగా, కొంతమంది స్మగ్లర్లు ఎర్రచందనం దుంగలను వాహనంలోకి లోడ్ చేస్తుండగా అటవీ సిబ్బందికి తారసపడ్డారు. దీంతో అటవీ సిబ్బంది వారిపై దాడులు జరిపి పట్టుకోవడానికి ప్రయత్నించగా, స్మగ్లర్లు ఎర్రచందనం దుంగలను పడేసి, అడవుల్లోకి పరారయ్యారు. దీంతో ఆ ప్రాంతంలో 11 ఎర్రచందనం దుంగలను, వాహనాన్ని స్వాధీనం చేసుకుని, పరారైన స్మగ్లర్ల కోసం అటవీ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగల విలువ రూ.5 లక్షల ఉంటుందని అటవీ అధికారులు తెలిపారు. డీఆర్వో వేణు, ఎఫ్‌బీవోలు రవి, రెడ్డప్పరెడ్డి, బేస్ క్యాంప్ ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

నేటినుంచి డిపార్ట్‌మెంటల్ పరీక్షలు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 27: జిల్లాలో ఆదివారం నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకు ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంటల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్ తెలిపారు. పరీక్షల నిర్వహణపై కలెక్టరేట్‌లో శనివారం అధికారులతో సమీక్షించారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయన్నారు. రెండు కేంద్రాలను ఏర్పాటు చేయగా, 3,142మది అభ్యర్థులు హాజరవుతున్నట్లు చెప్పారు. ఎస్వీ జూపార్కురోడ్డులోని అయాన్ డిజిటల్ జోన్, కోటమండలం విద్యానగర్‌లో ఎన్‌బీకేర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో పరీక్షలు జరుగుతాయన్నారు.

నేడు మెగా వైద్య శిబిరం

నాయుడుపేట, జూలై 27 : నాయుడుపేట స్వర్ణముఖినది పరివాహక ప్రాంతంలోని మల్లికాంబ దేవస్థాన ప్రాంగణంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు దేవస్థాన నిర్వాహకులు రామనారాయణ తెలిపారు. షుగర్, బీపీతోపాటు వివిధ రకాల వ్యాధులకు వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

దొరవారిసత్రం, జూలై 27: మండలంలోని వీఎస్ఆర్ నగర్ వద్ద జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి డివైడర్‌ను మోటారు సైకిలిస్టు ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బుడతోటి వాసు(22) శుక్రవారం రాత్రి మృతి చెందారు. బుదూరు గ్రామానికి చెందిన బుడతోటి వాసు తిరుపతి రుయాలో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం రాత్రి వరకు చికిత్సలు పొందాడు. పరిస్థితి విషమించడంతో చెన్నైకు తరలించే క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి నాయుడుపేట సమీపం వచ్చేసరికి మృతి చెందాడు.

బెదిరింపులకు దిగడం తగదు

బాలాయపల్లి, జూలై 27: మండలంలోని సుబ్రమణ్యం గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త కృష్ణవేణిని తొలగించడంలేదని అదే గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులు పీహెచ్‌సీ వైద్యాధికారిని బెదిరించడం తగదని జిల్లా ఆశ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు చాముండేశ్వరి అన్నారు. చిరుద్యోగులపై ఎలాంటి కక్ష సాధింపు చర్యలు ఉండవని కూటమి ప్రభుత్వం చెబుతున్నా బాలాయపల్లి మండలంలో ఉద్యోగులపై దౌర్జన్యం చేయడం ఎంతవరకు న్యాయం అని ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి హైమావతి తదితరులు పాల్గొన్నారు.

ఆగివున్న ట్రాలీని ఢీకొన్న బస్సు

తండ్రీకూతుళ్ల దుర్మరణం, 16మందికి గాయాలు

చిల్లకూరు, జూలై 27: చిల్లకూరు వద్ద జాతీయ రహదారిపై ఎస్కవేటర్ల లోడుతో ఆగివున్న ట్రాలీని వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందగా 16మందికి గాయాలయ్యాయి.సూళ్లూరుపేట డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు 33మంది ప్రయాణికులతో నెల్లూరు వైపు వెళుతోంది. చిల్లకూరు సమీపం వరగలి క్రాస్ రోడ్డు వద్ద ఎస్కవేటర్ల లోడుతో ఓ ట్రాలీ నెల్లూరువైపు వెళుతూ రోడ్డు పక్కన నిలిపివుంది. అదే సమయంలో ఆర్టీసీ బస్సు అదుపుతప్పి వెనుక నుంచి ట్రాలీని ఢీకొంది.దీంతో బస్సులో వున్న తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా ఊత్తుకోట మండలం ఎస్ఆర్ కండ్రిగ గ్రామానికి చెందిన ఝాన్సీరాణి(24) మృతి చెందింది. ఆమె తండ్రి కుమార్(55), మధుబాల, మనీషా, రూపిణి, చిన్నయ్య, అబ్దుల్ రఫీ, కోటేశ్వరి, పోలయ్య,జయలక్ష్మి, అనార్కలి, రమణయ్య, నిషాద్‌అహ్మద్, శంకర్, భక్తవత్సలరావు, ప్రవీణ్, మన్మథ కుమార్, ప్రవీణ్‌లకు తీవ్రగాయాలు కాగా మిగిలిన వారికి స్వల్పగాయాలయ్యాయి. ఘటనా స్థలాన్ని సీఐ వేణుగోపాల రెడ్డి, ఎస్ఐ సుధీర్‌కుమార్ పరిశీలించి గాయపడినవారిని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వారిని ఆర్డీవో కిరణ్‌కుమార్, డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి పరామర్శించారు.మెరుగైన చికిత్స నిమిత్తం కుమార్, మన్మథకుమార్, అబ్దుల్‌రఫీ, పోలయ్యలను నెల్లూరుకు తరలించారు.వీరిలో కుమార్ నెల్లూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. చిల్లకూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


ట్రాలీని ఢీకొని దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు, గూడూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రయాణికులు (ఇన్‌సెట్‌లో) మృతురాలు ఝాన్సీరాణి(ఫైల్‌ఫొటో)

మొక్కు తీర్చుకునేందుకు వెళుతూ అనంతలోకాలకు..

ఎస్ఆర్‌కండ్రిగ గ్రామానికి చెందిన ఝాన్సీరాణి(24)కి ఇటీవల చెన్నైలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులతో కలిసి నెల్లూరుజిల్లా గొలగమూడిలోని వెంకయ్య స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకునేందుకు బస్సులో వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది.తండ్రీకూతుళ్ల మృతి చెందడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

టీడీపీ సీనియర్ నేత గంధమనేని రమేష్ కన్నుమూత


గంధమనేని రమేష్ చంద్రప్రసాద్ (ఫైల్ ఫొటో)

నింద్ర/తిరుపతి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు, సీనియర్ నేత గంధమనేని రమేష్ చంద్రప్రసాద్ (77) కన్నుమూశారు. స్వగ్రామమైన పిచ్చాటూరు మండలం ఒరూరుపేటలోని తన నివాసంలో శనివారం రాత్రి 7 గంటల సమయంలో మృతి చెందారు. గత మార్చిలో గుండెపోటుకు గురై కోలుకున్నప్పటికీ వయోభారానికి తోడు అనారోగ్యంతో ఇంటిపట్టునే విశ్రాంతి తీసుకుంటూ శనివారం మరణించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె వున్నారు. పిచ్చాటూరు మండలం పాత శివగిరి గ్రామానికి చెందిన వీరి కుటుంబం తొలి నుంచీ రాజకీయాల్లో కొనసాగుతోంది. తండ్రి సుబ్బానాయుడు, తమ్ముడు శరత్‌చంద్రప్రసాద్ సర్పంచులుగా పనిచేయగా ఆయన చిన్నాన్న, సీపీఐ నాయకుడు శివయ్య గతంలో పుత్తూరు ఎమ్మెల్యేగా పనిచేశారు. ఇక రమేష్ చంద్రప్రసాద్ టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి కృషి చేశారు.స్వగ్రామం నింద్ర మండలంలో ఉన్నప్పటికీ పిచ్చాటూరు రాజకీయాల్లో 1980వ దశకంలో అరుణ అతిథిగృహం కేంద్రంగా రాజకీయ చతురత చాటుకుని చక్రం తిప్పారు.ఎన్టీ రామారావుకు ప్రియ శిష్యుడిగా, చంద్రబాబుకు ఆప్తుడిగా ఉంటూ జిల్లా రాజకీయాల్లో రాణించారు.జిల్లా తెలుగుదేశం పార్టీలో 1990, 2000 దశకాల్లో రమేష్ చంద్ర ప్రసాద్ క్రియాశీలకంగా పనిచేశారు. పార్టీ అధినేత చంద్రబాబుకు అత్యంత సన్నిహితంగా మెలగిన ఆయన పార్టీ అధికారంలో వున్న సమయంలోనే రెండు పర్యాయాలు జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు.రాజకీయాల్లో వివాద రహితుడిగా పేరు తెచ్చుకున్నారు.జిల్లావ్యాప్తంగా విస్తృత పరిచయాలున్న ఆయన నేతలకు, కార్యకర్తలకు అందుబాటులో వుంటూ అందరికీ తలలో నాలుకలా వ్యవహరించారు.రాష్ట్ర సహకార సంఘాల యూనియన్ చైర్మన్‌గా, రేణిగుంట మండలం గాజులమండ్యంలో వున్న ఎస్వీ షుగర్ ఫ్యాక్టరీ చైర్మన్‌గా పనిచేశారు. ఆయన తమ్ముడు హరీష్ చంద్రప్రసాద్ డీసీసీబీ చైర్మన్‌గా పనిచేశారు.కాగా రమేష్ చంద్రప్రసాద్ అంత్యక్రియలు వీరి కుటుంబం స్థిరపడిన ఒరూరుపేటలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు జరుగుతాయని కుటుంబీకులు తెలిపారు. ప్రజలతో నిత్య సంబంధాలు కలిగివుండే రమేష్ చంద్రప్రసాద్ మృతి బాధాకరమని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు.ఆయన కుటుంబసభ్యులకు సానుభూతి ప్రకటించారు. ఆయన మృతి టీడీపీకి తీరని లోటని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అభిప్రాయపడ్డారు.ఆయన మృతి పట్ల నింద్ర మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, శ్రీశైలం ఆలయ ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ చక్రపాణి రెడ్డి, ప్రముఖ రచయిత కోట పురుషోత్తం సంతాపం ప్రకటించారు.

మ్యాంగోనగర్‌లో అగ్నిప్రమాదం

11 మామిడి మండీలు దగ్ధం ● భారీగా ఆస్తి నష్టం ● బాధితులకు ఎమ్మెల్యే నాని పరామర్శ


దగ్ధమవుతున్న మామిడి మండీలు, మంటలకు ఆహుతైన మండీలు, బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

పాకాల, జూలై 27: పాకాల మండలంలోని మ్యాంగోనగర్‌లో శనివారం మధ్యాహ్నం సంభవించిన అగ్ని ప్రమాదంలో 11 మామిడి మండీలు దగ్ధమయ్యాయి. ఓ నివాస గృహం కాలిపోయింది. మధ్యాహ్నం ఓ మండీలో వ్యాపించిన మంటలు గాలి ఎక్కువగా రావడంతో వెంట వెంటనే సమీప మండీలకు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో అహ్మద్ బాషా, హకీం, గిరిధర్‌రెడ్డి, భాస్కరయ్య, మల్లికార్జున, జీఎస్.మస్తాన్, హజ్మల్ బాషా, ఫజరుల్లా, యాసానుల్లా, ఫరీద్ బాషా, అంజాద్ బాషాలకు సంబంధించిన మండీలు కాలిపోయాయి. మండీలలో ఉంచిన వస్తువులు. మోటరు సైకిళ్లు, పీవీసీ పైపులు, ఇతర సామగ్రి అగ్నికి ఆహుతి అయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.25 నుంచి 30 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని భావిస్తున్నారు. అగ్నిప్రమాద సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ డీడీఆర్ఎఫ్ రమణయ్య ఆధ్వర్యంలో చిత్తూరు, పీలేరు, తిరుపతి, పాకాల నుంచి అగ్నిమాపక వాహనాలు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. లేకుంటే మరింత భారీ నష్టం వాటిల్లేది. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే పులివర్తి నాని మ్యాంగోనగర్‌కు వెళ్లి అగ్నిప్రమాద బాధితులను పరామర్శించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలను విచారించాలని పోలీసులను ఆదేశించారు. అగ్నిప్రమాదంలో నష్టపోయిన బాధితులను ఆదుకోవాలని కలెక్టర్‌ను ఎమ్మెల్యే కోరారు.

61 పరిశ్రమలకు రూ.3.46కోట్ల ప్రోత్సాహకాలు


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 27: నూతన ఎంఎస్ఎంఈ పరిశ్రమల స్థాపనకు, యువతకు మెరుగైన ఉపాధి కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం శనివారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ నుంచి సింగిల్ డెస్క్ విధానంలో 1,127 పరిశ్రమలకుగాను 1,080కి అనుమతులు ఇచ్చామని మరో 43 పరిశీలనలో ఉన్నాయని వివరించారు. పరిశ్రమల పరిశీలన కమిటీకి అందిన మేరకు 61 పరిశ్రమలకు రూ.3.46కోట్ల ప్రోత్సాహకం అందించడానికి ఆమోదించినట్లు చెప్పారు. జిల్లాలో ఏపీఐఐసీ తిరుపతి ద్వారా భూమి కేటాయించబడిన పరిశ్రమలు, నాయుడుపేట స్పెషల్ జోన్ ద్వారా భూమి కేటాయించబడిన పరిశ్రమలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రతాప్‌రెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజరు చంద్రశేఖర్, అధికారులు రామకృష్ణారెడ్డి, రమణయ్య, విశ్వనాథరెడ్డి, సుశీలాదేవి, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో కుదిరి సర్పంచ్ ఆత్మహత్య


బుంగా చెంగయ్య (ఫైల్ ఫొటో)

సూళ్లూరుపేట, జూలై 27: రైలు కింద పడి కుదిరి సర్పంచ్ బుంగా చెంగయ్య (47) ఆత్మహత్య చేసుకొన్న ఘటన శనివారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు... మండల పరిధిలోని కుదిరి గ్రామానికి చెందిన చెంగయ్య వైసీపీలో ఉంటూ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. కొంతకాలంగా పార్టీ నాయకులతో అంటీముట్టనట్లు ఉంటూ వస్తున్నాడు. దీనికితోడు ఆర్థిక ఇబ్బందులు వెంటాడంతో మనస్థాపం చెంది శుక్రవారం ఇంటినుంచి వెళ్లిపోయినట్లు సమాచారం. రాత్రి 9 గంటలైనా రాకపోవడంతో కుటుంబసభ్యులు గాలించారు. శనివారం ఉదయం సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ సమీపంలో శవమై కనిపించాడు. రైల్వే పోలీసులు శవాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎంపీపీ అనిల్ రెడ్డి కుదిరికి వెళ్లి చెంగయ్య మృతదేహానికి పూలమాలలు వేసి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

మోమిడిలో క్రికెట్ పోటీలు

చిల్లకూరు, జూలై 27: మండలంలోని మోమిడి గ్రామంలో శశికుమార్, శేషేంద్ర జ్ఞాపకార్థం స్థానిక యువత ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు శనివారం పోటాపోటీగా సాగాయి. ఉదయం మోమిడి-బీ, ఏరూరుకాయలపాళెం జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన ఏరూరు కాయలపాళెం జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 76 పరుగులు చేసింది. అనంతర బ్యాటింగ్‌కు దిగిన మోమిడి-బీ జట్టు 6.4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 77 పరుగులు చేసి విజయం సాధించింది. మధ్యాహ్నం చింతవరం-గుమ్మళ్లదిబ్బ జట్లు మధ్య మ్యాచ్ జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన చింతవరం జట్టు నిర్ణీత 11 ఓవర్లలో 67 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్ చేసిన గుమ్మళ్లదిబ్బ జట్టు 10.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 68 పరుగులు చేసి విజయం సాధించింది.

ఎన్టీఆర్ కాలనీలో యువతకు కౌన్సెలింగ్


వెంకటగిరిలో యువతకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

వెంకటగిరి, జూలై 27: వెంకటగిరి 6వ వార్డులోని ఎన్టీఆర్ కాలనీలో కొంతమంది ఆకతాయిలు పెట్రేగి పోతున్నారని స్థానికులు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు లేఖలు రాశారు. ఎన్టీఆర్ కాలనీలో 1వ వీధిలో కొందరు ఆకతాయిలు రాత్రి వేళల్లో బైకులపై వేగంగా అటూ ఇటూ తిరుగుతూ మహిళలను వేధిస్తున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. ఆకతాయిలు వేగంగా నడిపే బైకు దృశ్యాలు, నెంబరు ప్లేటుతో సహ ఫొటోలు తీసి లేఖకు జతచేసి ఉప ముఖ్యమంత్రికి పంపారు. పవన్ కల్యాణ్ ఈ ఘటనపై స్పందించి ఎస్పీ సుబ్బరాయుడుతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ మేరకు వెంకటగిరి సీఐ సంగమేశ్వరావు ఎన్టీఆర్ కాలనీకి చేరుకొని ఆకతాయిల వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. కాలనీలోని యువకులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఎంబీయూలో బెలూన్ శాటిలైట్ ప్రయోగం



చంద్రగిరి, జూలై 26: తిరుపతి సమీపంలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో బెలూన్ శాటిలైట్ ప్రయోగం విజయవంతమైనట్లు ఛాన్సలర్ మోహన్‌బాబు ప్రకటించారు.జాతీయ వాతావరణ పరిశోధనా ప్రయోగశాల(ఎన్ఏఆర్ఎల్), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఐఐఎస్టీ) సహకారంతో ఎంబీయూ విద్యార్థులు తయారు చేసిన ఈ బెలూన్ శాటిలైట్‌ను శనివారం ఉదయం ఎంబీయూలోని పాఠశాల క్రీడామైదానంలో సినీనటుడు, ఎంబీయూ ఛాన్సలర్ మోహన్‌బాబు చేతులమీదుగా నింగిలోకి వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు కిలోల బరువుగల శాటిలైట్ 35 కిలో మీటర్ల ఎత్తులో 200 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుందన్నారు.కార్బన్ డయాక్సైడ్ స్థాయి, ఓజోన్ సాంద్రతలు, ఉష్ణోగ్రత, తేమ, వాతావరణ పీడనం వంటి క్లిష్టమైన పర్యావరణ పరిమితులను ఈ శాటిలైట్ పర్యవేక్షిస్తుందన్నారు.ఈ కార్యక్రమానికి హాజరైన ఇస్రో శాస్త్రవేత్తలైన, చంద్రయాన్ మిషన్ 3 డైరెక్టర్ డాక్టర్ వీరముత్తువేల్, అసోసియేట్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ కల్పన, ఓషన్ శాట్ 3 మిషన్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ తెన్మొయి శెల్వి, షార్ ఇస్రో గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ గోపికృష్ణ మాట్లాడుతూ ఎంబీయూ విద్యార్థులకు తమవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. అనంతరం శాస్త్రవేత్తలను మోహన్‌బాబు, ప్రో ఛాన్సలర్ మంచు విష్ణు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎన్ఏఆర్ఎల్ శాస్త్రవేత్త డాక్టర్ వెంకటరత్నం, ఎంబీయూ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి, వైస్ ఛాన్సలర్ నాగరాజరామా రావు, చీఫ్ గ్రోత్ అండ్ స్ట్రాటజిక్ ఆఫీసర్ వికాస్ సింగ్, ఆర్ అండ్ డీ డీన్ ఈశ్వర్ తదితరులు పాల్గొనున్నారు.



బోధనలో నూతన ఒరవడే టీచ్‌టూల్ లక్ష్యం

జిల్లా ఏఎంవో శివశంకర్


సర్టిఫికెట్లను అందజేస్తున్న జిల్లా ఏఎంవో శివశంకర్

నాయుడుపేటటౌన్, జూలై27: బోధనలో నూతన ఒరవడే... టీచ్‌టూల్ లక్ష్యమని జిల్లా విద్యాశాఖ ఏఎంవో శివశంకర్ అన్నారు. నాయుడుపేట బాలుర ఉన్నత పాఠశాలలో 9 రోజులుగా నిర్వహిస్తున్న టీచ్‌టూల్ ముగింపు శిక్షణా కార్యక్రమం శనివారం నిర్వహించారు. శివశంకర్ మాట్లాడుతూ ప్రపంచదేశాల విద్యాప్రాజెక్టు లక్ష్యాలను అనుసరించి టీచ్‌టూల్‌లను రూపొందించారన్నారు. ఈ టీచ్‌టూల్ ద్వారా ఉపాధ్యాయుల తరగతి బోధనల్లో మూడు ఏరియాలు, 9ఎలిమెంట్స్, 28 బిహేవియర్స్‌ను అంచనా వేస్తారన్నారు. తద్వారా విద్యార్థులకు నవ్య బోధన పద్ధతులు అవలంబించే అవకాశం ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు బోధనకు వెచ్చించే సమయం, విద్యార్థుల సామాజిక, మానసిక పరిజ్ఞానం, నైపుణ్యం, బోధనాపద్ధతులను కొలమానం చేయడంతో పాటు తరగతి గది నైపుణ్యాలను పెంపొందిస్తారన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో గూడూరు ఇన్‌చార్జి డిప్యూటీ డీఈవో శాంతి, ఎంఈవోలు మునిరత్నం, చంద్రశేఖర్, చలంబాబు, టీచ్‌టూల్ రీసోర్స్ పర్సన్స్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమంపై ప్రత్యేక దృష్టి : ఎమ్మెల్యే విజయశ్రీ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ

పెళ్లకూరు, జూలై 27 : పెళ్లకూరు మండలంలో 90 శాతానికి పైగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని, వారి సంక్షేమం కోసం ప్రత్యేక కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. శనివారం జరిగిన పెళ్లకూరు మండల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకతీతంగా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక నేతలు పెళ్లకూరు మండల పరిధిలో గురుకుల పాఠశాలలేని విషయాన్ని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ పెళ్లకూరు మండలంలో గురుకుల పాఠశాల ఏర్పాటుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పసుపుకండ్రిగలో తాగునీటి సమస్య ఏర్పడి నెలరోజులైనా పట్టించుకోలేదని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీడీవో అన్నపూర్ణరావు, ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్ రెడ్డి, జట్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా, వైస్ ఎంపీపీ సుధారాణి, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, దామెర ప్రసాద్‌నాయుడు, సర్పంచులు కందమూడి శివకుమార్, శేఖర్‌నాయుడు, సిద్ధులయ్యనాయుడు, నరేంద్ర యాదవ్, మల్లికార్జునరెడ్డి, పోలయ్య, సుబ్రమ్మణ్యం పాల్గొన్నారు.

కర్మాగారంలో కార్మికుడి మృతి



ప్రసాద్ (ఫైల్‌ఫొటో)

శ్రీకాళహస్తి, జూలై 27: శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరి వద్ద ఉన్న ఓ ప్రైవేటు కర్మాగారంలో భారీ పైపు మీద పడటంతో ప్రసాద్(48) అనే కార్మికుడు మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. మండలంలోని కాపుగున్నేరికి చెందిన ప్రసాద్ సమీప గ్రామం రాచగున్నేరిలోని పైపుల కర్మాగారంలో కార్మికుడుగా పనిచేసేవాడు. శనివారం వేకువజామున విధులు నిర్వహిస్తుండగా భారీ పైపు మీద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని పరిశ్రమ నిర్వాహకులు శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి, డీఎస్పీ ఉమామహేశ్వర్‌రెడ్డి ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. టీడీపీ నాయకులు కామేష్‌యాదవ్, చెంచయ్య నాయుడు మృతుడి కుటుంబానికి అండగా నిలిచి అంతిమ సంస్కారాలు పూర్తయ్యే వరకు సహాయక చర్యలు అందించారు.

అనుమానాస్పద స్థితిలో ఎఫ్‌సీఐ గోదాము కూలీ మృతి



దీపక్ (ఫైల్‌ఫొటో)

ఏర్పేడు, జూలై 27: ఏర్పేడు మండలం సీతారాంపేట వద్ద ఉన్న ఎఫ్‌సీఐ గోదాములో కార్మికుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సీఐ శ్రీరామ శ్రీనివాసులు కథనం మేరకు... సీతారాంపేట వద్ద ఉన్న ఎఫ్‌సీఐ గోదాములో ఏడాదిగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన కార్మికుడు దీపక్ పనిచేస్తున్నాడు. ఈ నెల 25న కాలకృత్యాలకు వెళ్లి తిరిగి రాలేదు. తోటి కార్మికులు వెతికినప్పటికీ దీపక్ ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం ఉత్తరప్రదేశ్‌కు చెందిన కొంతమంది హమాలీలు ఎఫ్‌సీఐ గోదాము పక్కన చిన్నగుంట వైపు బహిర్భూమికి వెళ్లారు. ఆ సమయంలో దీపక్ మృతదేహం నీళ్లలో తేలుతుండడాన్ని గుర్తించి గోదాము అధికారులకు తెలియజేశారు. గోదాము అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ శ్రీరామ శ్రీనివాసులు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నీళ్లలో నుంచి దీపక్ మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

ఏర్పేడు, జూలై 27: చిల్లర దుకాణం నిర్వహిస్తున్న మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగులు అపహరించుకుపోయిన ఘటన ఏర్పేడు మండలంలో శనివారం చోటు చేసుకుంది. సీఐ శ్రీరామ శ్రీనివాసులు కథనం మేరకు.... మండలంలోని జంగాలపల్లె పంచాయతీ శివగిరిపల్లెకు చెందిన దేవకి(60) చిల్లర దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తోంది. శనివారం ఇద్దరు గుర్తుతెలయని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వెళుతూ దేవకి చిల్లర దుకాణం వద్ద ఆగి సిగిరెట్టు అడిగి తీసుకున్నారు. తిరిగి డబ్బులు ఇస్తూ దేవకి మెడలో ఉన్న బంగారు గొలుసు లాక్కుని ద్విచక్ర వాహనంపపై పరారయ్యారు. బాధితురాలు దేవకి శనివారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

నాటు తుపాకీ స్వాధీనం: ఇద్దరి అరెస్టు



నిందితులతో పోలీసులు

నారాయణవనం, జూలై 27: మండల పరిధిలోని నాగిలేరు అడవి వద్ద ఇద్దరిని అరెస్టు చేసి నాటు తుపాకీ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ భాస్కర్ నాయక్ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నాగిలేరు అడవి జవుక మిట్ట వద్ద ఎస్‌ఐ లక్ష్మీనారాయణ సిబ్బందితో వెళుతుండగా వారిని గమనించిన ఇద్దరు వ్యక్తులు పారిపోవడానికి ప్రయత్నించారు. వారిని పోలీసులు వెంబడించి అదుపులోకి తీసుకుని విచారించగా నారాయణవనం మండలానికి చెందిన గోపిరెడ్డి, శ్రీనివాసులుగా తెలిసింది. నాటు తుపాకీతో అడవి పందులను వేటాడి, వాటి మాంసాన్ని చుట్టుపక్కల వారికి విక్రయిస్తున్నట్లు వెల్లడించారు. వారి వద్ద ఉన్న నాటు తుపాకీని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ లక్ష్మీనారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

టీటీడీ అదనపు ఈవోకు ముక్కంటి ప్రసాదాలు



వెంకయ్య చౌదరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మల్లికార్జున యాదవ్

శ్రీకాళహస్తి, జూలై 27: టీటీడీ అదనపు ఈవోగా బాధ్యతలు స్వీకరించిన వెంకయ్య చౌదరిని శ్రీకాళహస్తి మండలం రామాపురం పంచాయతీ మాజీ సర్పంచు కూనాటి మల్లికార్జున యాదవ్ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనను ముక్కంటి శేషవస్త్రంతో సన్మానించి స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందజేశారు.

శ్రీకాళహస్తి

సత్యవేడు

ఆడికృత్తిక ఏర్పాట్ల పరిశీలన



నారద పుష్కరిణిని పరిశీలిస్తున్న ఈవో మూర్తి

శ్రీకాళహస్తి, జూలై 27: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన శ్రీవల్లీ, దేవసేన సమేత కుమారస్వామి ఆలయంలో ఆడికృత్తిక ఏర్పాట్లను శనివారం ఈవో ఎస్‌వీఎస్‌ఎస్ మూర్తి పరిశీలించారు. ఆదివారం భరణి, సోమవారం ఆడికృత్తిక సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేయనుండడంతో విజ్ఞానగిరిపై అధికారులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. ప్రత్యేక క్యూలైన్లు, తాగునీటి సౌకర్యం, వీఐపీలకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. తలనీలాలు సమర్పించే భక్తులు స్నానాలు చేయడానికి స్నాన ఘట్టాలను ఏర్పాటు చేశారు.

హంస వాహనంపై కుమారస్వామి రాజసం



హంస వాహనంపై కుమారస్వామి

శ్రీకాళహస్తి, జూలై 27: విజ్ఞానగిరిపై వెలసిన శ్రీవల్లీ, దేవసేన సమేత కుమారస్వామి శనివారం హంస వాహనంపై ఊరేగారు. ఆలయంలోని అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ స్వామి అమ్మవార్లను హంస వాహనంపై అధిష్ఠించారు. పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకుని కర్పూర నీరాజనాలు సమర్పించారు. అలాగే రాత్రి రావణబ్రహ్మపై శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి పురవిహారం చేశారు.

12న రేణిగుంట గంగమ్మ జాతర

రేణిగుంట, జూలై 27: రేణిగుంట గంగమ్మ జాతర ఆగస్టు 12, 13, 14వ తేదీల్లో నిర్వహించనున్నట్లు గంగమ్మ ఆలయ ధర్మకర్త సోలా మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. శనివారం గంగమ్మ ఆలయంలో ధర్మకర్తల మండలి సభ్యుల సమావేశం నిర్వహించారు. ఆగస్టు 6న చాటింపు, 12, 13, 14న జాతర నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు జ్యోతి నారాయణ, వీఆర్ రావణన్, సదాశివరెడ్డి, లక్ష్మీరెడ్డి, గోపిస్వామి, చిన్న, బాబు తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం

ఏర్పేడు, జూలై 27: తమిళనాడుకు చెందిన ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్శిటీ శనివారం హోసూరులో తనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు చిందేపల్లిలోని సిద్ధేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త గంగలపూడి గిరిధర్‌రెడ్డి తెలిపారు. గిరిజన కుటుంబాల అభివృద్ధికి కృషి చేయడంతో పాటు కరోనా సమయంలో అందించిన సేవలను గుర్తించి డాక్టరేట్ ఇచ్చారని తెలిపారు.

కళత్తూరులో ధ్వజారోహణం

కేవీబీపురం, జూలై 27: మండలంలోని కళత్తూరులో ఉన్న అంకాళమ్మ పరమేశ్వరి ఆదిశంకరుల ఆలయంలో వెలసిన సుబ్రహ్మణేశ్వరస్వామి ఆడికృత్తిక మహోత్సవాలు శనివారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. 29న ఆడికృత్తిక మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త జయరామిరెడ్డి తెలిపారు. అలాగే 29 నుంచి 31వ తేదీ వరకు ఆలయంలో నిత్యం పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఆగస్టు 1న ఊంజల్‌సేవతో ఉత్సవాలు ముగియనున్నట్లు తెలిపారు. భక్తులకు సౌకర్యార్థం నిర్మించిన మెట్ల స్నాన ఘట్టాన్ని శనివారం ప్రారంభించారు.

గురుకులం నిర్వహణ ఇలాగేనా: ఎమ్మెల్యే

ఏకలవ్య పాఠశాలలో అధ్వాన పారిశుధ్యం

మెనూ పాటించకపోవడంపై ఆగ్రహం



హాస్టల్ ఉన్న చెత్తను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 27: మండలంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో పరిస్థితులపై సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై శనివారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై ఎమ్మెల్యే స్పందించారు. ఐటీడీఏ పీడీ పరిమిళ, జిల్లా ట్రైబల్ డీడీ సూర్యనారాయణతో కలసి గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. మరుగుదొడ్లలో అపరిశుభ్రత, హస్టల్ ఆవరణలో ఎక్కడిబడితే అక్కడ చెత్త ఉండటం, తాగునీటి సమస్య, నాణ్యతలేని కూరగాయలు, వంట మనుషుల కొరత, మెనూ పాటించకపోవడంపై ప్రిన్సిపాల్, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులను విచారించగా హస్టల్ పలు సమస్యలను ఏకరువు పెట్టారు. మెనూ ప్రకారం భోజనం, కోడిగుడ్లు పెట్టడం లేదని, స్నాక్స్ ఇవ్వడం లేదని, చికెన్ రెండు ముక్కలు వేస్తున్నారని, ప్రతి రోజూ పప్పు కూర మాత్రమే వడ్డిస్తున్నారని, స్నానానికి నీళ్ల లేవని, ఒకే గదిలో పదిమంది ఉంటున్నామని, నీళ్ల పాలు, ఉడికీఉడకని అన్నం పెడుతున్నారని, మెస్‌లో ఫ్యాన్లు సక్రమంగా లేవని వివరించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు చెప్పే పాఠశాలు అర్థం కావడంలేదని చెప్పారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి ఇతర రాష్ట్రాల ఉపాధ్యాయులను మార్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో పారిశుధ్యం మెరుగుపరచడానికి, పరిసరాలను శుభ్రంగా ఉంచడానికి ఎంపీడీవో, ఇతర శాఖలను సమన్వయం చేసుకుని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలసి ఎమ్మెల్యే భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబు నాయుడు, ఎంఈవో రవీంద్రనాథ్, డాక్టర్ దివాకర్, టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు, కన్నయ్య నాయుడు, మధునాయుడు, సుధాకర్ నాయుడు, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

తారురోడ్డు ప్రారంభం

పిచ్చాటూరు, జూలై 27: పిచ్చాటూరు మండలంలోని రామగిరి ప్రధాన రహదారి నుంచి వాలీశ్వరస్వామి ఆలయం వరకు నూతన నిర్మించిన 1.2 కిలోమీటర్ల తారురోడ్డును సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడికృత్తిక ఉత్సవాల నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా రూ.60 లక్షలు వ్యయంతో తారురోడ్డు నిర్మాణం పూర్తి చేసినట్లు వివరించారు. ఆడికృత్తిక సందర్భంగా రామగిరి ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దర్శనం కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ వెంకటేశులు నాయుడు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి, నాయకులు పద్మరాజు, జయచంద్ర నాయుడు, రామచంద్రరాజు, రవినాయుడు, అరుణ్ ప్రకాష్, రాజేంద్రన్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడికి గాయాలు

రేణిగుంట, జూలై 27: ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడు గాయాల పాలైన ఘటన శనివారం మధ్యాహ్నం తిరుపతి- రేణిగుంట మార్గంలో పారిశ్రామిక వాడలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సునీల్ కథనం మేరకు.. స్థానిక గంగమ్మగుడి వీధికి చెందిన తిప్పయ్య రోడ్డు దాటుతుండగా రాజంపేట నుంచి తిరుపతి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. తిప్పయ్య ఎడమ కాలికి తీవ్ర గాయం కావడంతో అతనిని 108 వాహనంలో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. గాజులమండ్యం ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రేష్ట పథకానికి ఇద్దరు విద్యార్థుల ఎంపిక

వరదయ్యపాళెం, జూలై 27: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన శ్రేష్ట పథకానికి మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. కారిపాకం ఉన్నత పాఠశాలలో 2023-24లో పదో తరగతి చదివిన వరదయ్యపాళానికి చెందిన ధీరజ్, సీఆర్‌సీ కండ్రిగకు చెందిన రితీష్ స్వచ్ఛ్ రూరల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో శిక్షణ పొంది శ్రేష్ట పథకానికి ఎంపికయ్యారు. తమిళనాడులోని కన్యాకుమారి జిల్లా నాగర్‌కోయిల్‌లోని ఎన్ఎం కేంద్ర విశ్వవిద్యాలయంలో ఇంటర్మీడియట్‌లో ప్రవేశం పొందారు.

అలరించిన గజేంద్రమోక్షం కథా ప్రవచనం



ప్రవచనం చేస్తున్న కోట రాజశేఖర్

శ్రీసిటీ, జూలై 27: శ్రీసిటీ ఆధ్యాత్మిక, సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో స్థానిక బిజినెస్ సెంటర్‌లో శనివారం నిర్వహించిన పోతన భాగవతంలోని గజేంద్రమోక్షం కథా ప్రవచనం ఆహూతులను అలరించింది. నెల్లూరుకు చెందిన అష్టావధాని బ్రహ్మశ్రీ కోట రాజశేఖర్ తనదైన శైలి, ఆధ్యాత్మిక వివరణలతో ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన చెన్నైకు చెందిన వేద విజ్ఞాన వేదిక కార్యదర్శి మధు మాట్లాడుతూ కోట రాజశేఖర్ అందించిన లోతైన ఆధ్యాత్మిక విశ్లేషణలను కొనియాడారు. ఆధ్మాత్మిక, సాహిత్య రచనల్లో కోట రాజశేఖర్ చేస్తున్న కృషిని అభినందిస్తూ శ్రీసిటీ శ్రీవాణి తరఫున ఆయనను ఘనంగా సత్కరించారు.

విద్యార్థులకు విమానయాన అవకాశం



హైదరాబాద్‌కు బయలుదేరిన విద్యార్థులు

శ్రీకాళహస్తి, జూలై 27: ముచ్చివోలు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు విమానయాన అవకాశం లభించింది. 2023-24 విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన జలజ, సిరి, తృతీయ స్థానం పొందిన భువేందర్, లిఖితను ఉపాధ్యాయులు బండారు మణిధర్, చల్లా ముని సుబ్బారెడ్డి, డాక్టర్ నారాయణరెడ్డి, సనంపూరి నరసయ్య తమ సొంత ఖర్చులతో విద్యార్థులకు విమానయాన అవకాశం కల్పించారు. శనివారం ఉపాధ్యాయుడు చల్లా మునిసుబ్బారెడ్డి విద్యార్థులను విమానయానంలో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

పుత్తూరు వార్తలు

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు టౌన్, జూలై 27: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర పేర్కొన్నారు. శనివారం సబ్ కోర్టులో న్యాయవాదులతో హెల్మెట్ వాడకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుకోకుండా జరిగే ప్రమాదాల భారిన పడే వాహనదారులు చాలామంది హెల్మెట్ లేని కారణంగానే మృత్యువాత పడుతున్నారని అన్నారు. వాహనదారులు ప్రతిఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్‌ను వాడాలని కోరారు. కార్యక్రమంలో ఏజీపీ ఉదయ్‌కుమార్, కోర్టు పర్యవేక్షణాధికారి గిరిప్రసాద్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పిళ్లారిపట్టు పాలిటెక్నిక్‌లో 31న స్పాట్ అడ్మిషన్లు

పుత్తూరు, జూలై 27: పుత్తూరు మండలంలోని పిళ్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో కౌన్సెలింగ్‌లో మిగిలిపోయిన సీట్లను ఈనెల 31వ తేదీన స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నామని ప్రిన్సిపాల్ ఎస్‌వీ కుమార్ తెలిపారు. పదవ తరగతి పాసై పాలిసెట్‌లో అర్హత సాధించలేకపోయినా స్పాట్ అడ్మిషన్‌కు అర్హులని చెప్పారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ వర్తించదని స్పష్టం చేశారు.

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో శ్రీనివాసుడు

వడమాలపేట, జూలై 27: అప్పలాయగుంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజల సేవ వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వెంకటేశ్వరస్వామిని సర్వాభరణాలు, పూలమాలలతో ఊయలలో అలంకరించి వేదమంత్రాలు, భక్తులు గోవిందనామ స్మరణల నడుమ శ్రీవారి ఊంజల సేవ నిర్వహించారు. అనంతరం సర్వాలంకార భూషితుడైన పద్మావతీ అండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామిని మేళతాలలు, మంగళ వాయిద్యాల నడుమ మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేల, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా కల్యాణ వెంకన్న ఊంజలసేవ



నారాయణవనం, జూలై 27: నారాయణవనంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వెంకన్న ఊంజలసేవను వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. అనంతరం స్వామివారిని, శ్రీదేవి, భూదేవి ఉత్సవర్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ బట్టాచార్య, శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న ఊంజలసేవ నిర్వహించారు. భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. ఆలయాధికారులు భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయాధికారులు నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీజే అబ్దుల్ కలాంకు ఘన నివాళి



కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

పుత్తూరు అర్బన్, జూలై 27: మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ముందుగా అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విజయ్‌బాబు మాట్లాడుతూ అబ్దుల్ కలాం పోఖ్రాన్-2 అణు పరీక్షలు నిర్వహించి భారతదేశ ఖ్యాతి ప్రపంచ దేశాలకు చాటిచెప్పారని గుర్తుచేశారు. అగ్ని, పృధ్వి క్షిపణులు రూపకల్పనలో కీలకపాత్ర పోషించి కలాం మిస్సైల్ మ్యాన్‌గా పేరొందారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రవి నాయుడు, ధనపాల్, శ్రీజ బాలాజీ నాయుడు, చంద్ర యాదవ్, దాసరి విజయ్ చౌదరి, గాలి సుబ్రహ్మణ్యం నాయుడు, ఢిల్లీ, బాబురెడ్డి, మధుసూదన్ రాజు, కుమార్‌రెడ్డి, అజయ్‌చౌదరి, పరంధామ్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో క్రమశిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో

పుత్తూరు టౌన్, జూలై 27: స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వారా శిక్షణలో విద్యార్థులకు క్రమశిక్షణ అలవడుతుందని విద్యాశాఖాధికారి ప్రభాకర్‌రాజు అన్నారు. శనివారం పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠ శాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణలో విద్యార్థులు క్రమశిక్షణతో పాటు సేవాతత్వం అలవడుతుందన్నారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ వెంకటేశ్వర్లు, గైడ్స్ కెప్టెన్ సునీత, నాగరత్నం, రెడ్డిరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.